

# శ్రీసాయి సత్యవ్రతము

రచన : ఆలూరు గోపాలరావు

## వ్రతమునకు కావలసిన సామాగ్రి

వ్రతమునకు :

1. పసుపు 2. కుంకుమ 3. గంధము 4. తమలపాకులు 5. వక్కలు (వక్కపొడి 6. అగరుబత్తి 7. కర్పూరము 8. అరటిపళ్ళు 9. కొబ్బరికాయలు 10. బియ్యంముక్క 11. పూలు, పూలదండ 12. కుంది లేక ప్రమిద 13. వత్తులు 14. దీపారాధన నూనె ( ఆవునెయ్యి లేక నువ్వులనూనె 15. గ్లాసులు రెండు 16. ఉద్ధరిణ లేక స్పూను 17. పళ్ళెములు రెండు 18. బాబా పటము లేక విగ్రహము.

పంచామృత స్నానమునకు :

1. ఆవుపాలు 2. ఆవునెయ్యి 3. ఆవు పెరుగు 4. తేనె 5. పంచదార మరియు బాబా చిన్న విగ్రహము

వ్రత ప్రసాదము :

1. రవ్వ 2. పంచదార 3. జీడిపప్పు 4. యాలకులు 5. కిస్‌మిస్

సూచన :

పూజ ప్రారంభమునకు ముందే పూజాసామాగ్రి మొత్తం సిద్ధము చేసుకొనవలెను. పూజ ప్రారంభమైనప్పటినుండి వ్రతము పూర్తియై, తీర్థప్రసాదములు తీసికొనువరకు వ్రతము చేసుకొను దంపతులు అచటనే కూర్చొనియుండి శ్రద్ధా - భక్తులతో వ్రతము చేసుకొనవలెను. ఏకాగ్రత అవసరము.

పూజప్రారంభములో స్నానముచేసి శుభ్రమైన వస్త్రములు ధరించి, గృహములో తూర్పుముఖముగా గాని, ఉత్తరముఖముగా గాని కూర్చుండవలెను. మందిరములలో సాయిబాబా విగ్రహమునకు ఎదురుగా కూర్చుండవలెను.

## శ్రీసాయి సత్యవ్రతము

# శ్రీ సాయిబాబా వ్రతకల్ప పూజా ప్రారంభము

సమర్థ సద్గురువు శ్రీషిరిడీ సాయినాథునకు శతకోటి ప్రణామములు సమర్పించుకొనుచు - శ్రద్ధా - భక్తులతో శ్రీ సాయి సత్యవ్రతము ప్రారంభించుకొనుచున్నాము.

బాబా వ్రతము చేసుకొనుటకు ఒక పీటకు పసుపు పూసి, బియ్యపుపిండి - కుంకుమలతో దానిపై ముగ్గువేసి, సాయిబాబా చిత్రపటమునుగాని, విగ్రహమునుగాని దానిపై ఉంచవలెను. పసుపుతో గణనాథుని చేసి తమలపాకు నందుంచి సాయిబాబా పటమునకు ముందు ఉంచవలెను. వ్రతము చేసుకొను దంపతులు ఆ బాబా పటమునకు ఎదురుగా కూర్చొనవలెను.

ముందుగా శుచి అగుటకు ఈ క్రింది శ్లోకమును చదువుచు ఉద్ధరిణెతో నీటిని తీసుకొని కుడిచేతి బొటనవ్రేలితో ఆ నీటిని ఈ వ్రతములో పాల్గొనువారందరు ఓం శ్రీసాయినాథాయ నమః అని మూడుసార్లు అనుచు తలపై చల్లుకొనవలెను.

అపవిత్రః పవిత్రోవా ।
సర్వావస్థాంగతోఽపివా ।
యః స్మరే త్పుండరీకాక్షం ।
స బాహ్యాభ్యంతర శ్శుచిః ॥

బాబాకు నమస్కారం చేసుకొనుచు ఈ క్రింది గురుశ్లోకం చదువవలెను.

శ్లో॥ గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీగురవే నమః ॥
సాయి గురవే నమః

నీళ్ళతో రెండు గ్లాసులు ఉంచుకొనవలెను. ఒక గ్లాసులోని నీటిని ఆచమనమునకు, రెండవ గ్లాసులోని నీటిని పూజకు కలశముగా ఉపయోగించుకొనవలెను.

ఇప్పుడు ఆచమనము చేయవలెను. ఉద్ధరిణెతో నీటిని కుడిచేతిలోకి తీసుకొని త్రాగుచూ ఈ క్రింది మంత్రములు చెప్పవలెను.

ఓం కేశవాయ స్వాహా

ఓం నారాయణాయ స్వాహా

ఓం మాధవాయ స్వాహా

తరువాత చేయి కడుగుకొనవలెను. దీపారాధన చేయవలెను.

దీపపు కుందిని చిన్నపళ్ళెములోకాని, ఆకుపైగాని ఉంచి, నూనె, వత్తులువేసి, వేరొక వత్తితో దీపారాధన వత్తులను వెలిగించి, ఆ కుందికి కుంకుమపెట్టి పూలు ఉంచి నమస్కించుకొనవలెను.

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ।

ప్రసన్నవదనం ధ్యాయేత్‌సర్వవిఘ్నోపశాంతయే ॥

మరలా ఆచమనము చేయవలెను. ఉద్ధరిణెతో నీళ్ళను తీసుకొని కుడిచేతిలో పోసుకొని, చేతిని శుభ్రము చేసుకొని ముందున్న పళ్ళెములో ఆనీటిని వదలవలెను. మరల అలానే నీటిని తీసుకొని పుచ్చుకొనుచు (త్రాగుచు) ఈ క్రింది మూడు మంత్రములు చెప్పవలెను.

1. ఓం కేశవాయ స్వాహా
2. ఓం నారాయణాయ స్వాహా
3. ఓం మాధవాయస్వాహా

ఇలా మూడుసార్లు తీసికొన్న తరువాత మరల నీటిని చేతిలోనికి తీసికొని చేతిని శుభ్రము చేసుకోవలెను. భర్త ఆచమనము చేసిన తరువాత ఉద్ధరిణెతో భార్య చేతిలోనీటిని వేయవలెను. ఆమెకూడ ఆమూడు మంత్రములు చెప్పుచు ఆచమనము చేయవలెను. దంపతులిద్దరు కలసి చేయునప్పుడు ప్రతి కలాపము ఇద్దరు కలసి చేయవలెను. తరువాత బాబాకు నమస్కారము చేయుచు ఈ క్రింది నామములు చెప్పవలెను.

4. ఓం గోవిందాయ నమః 5. ఓం విష్ణవే నమః

6. ఓం మధుసూదనాయ నమః 7. ఓం త్రివిక్రమాయ నమః

8. ఓం వామనాయ నమః 9. ఓం శ్రీధరాయ నమః

10. ఓం హృషీకేశాయ నమః 11. ఓం పద్మనాభాయ నమః

12. ఓం దామోదరాయ నమః 13. ఓం సంకర్షణాయ నమః

14. ఓం వాసుదేవాయ నమః 15. ఓం ప్రద్యుమ్నాయ నమః

16. ఓం అనిరుద్ధాయ నమః 17. ఓంపురుషోత్తమాయ నమః

18. ఓం అధోక్షజాయ నమః 19. ఓం నారసింహాయ నమః

20. ఓం అచ్యుతాయ నమః 21. ఓం జనార్ధనాయ నమః

22. ఓం ఉపేంద్రాయ నమః 23. ఓం హరయే నమః

24. ఓం శ్రీకృష్ణాయ నమః

కుడిచేతిలోనికి అక్షతలు తీసికొని శ్వాస వదలుచు ముక్కువద్ద చూపి, ఈ క్రింది శ్లోకమును చదివి ఆ అక్షతలను పురుషులు కుడిప్రక్కగా వెనుకకు వేయవలెను. స్త్రీలు ఎడమప్రక్కగా వెనుకకు వేయవలెను.

శ్లో॥ ఉత్తిష్ఠంతు భూతపిశాచాః, ఏతే భూమిభారకాః।

ఏతేషా మవిరోధేన బ్రహ్మకర్మసమారభే ॥

ప్రాణాయామము : కుడిచేతి చిటికెనవ్రేలు, చూపుడువ్రేలు వదలి, మిగిలిన మూడువ్రేళ్ళతో ముక్కును పట్టుకుని గాలిని ఒక్కొక్క ముక్కుద్వారా పీల్చి వదలుచు, బంధించుచూ ఈ క్రింది మంత్రము చదువవలెను.

ఓం భూః ఓం భువః ఓగ్ం సువః ఓం మహః ఓం జనః ఓం తపః ఓగ్ం సత్యం ఓం తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్ ఓమాఽపోజ్యోతీ రసోమృతం బ్రహ్మభూర్భువస్సువరోమ్ ॥

సంకల్పము చెప్పుకోవాలి.

మమ ఉపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీసాయినాథ ముద్దిశ్య, శ్రీ సాయినాధ ప్రీత్యర్థం శుభే శోభనే ముహూర్తే, శ్రీమహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్య బ్రహ్మణః, ద్వితీయపరార్థే, శ్వేతవరాహకల్పే, వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే, భరతవర్షే భరతఖండే మేరోః దక్షిణ దిగ్భాగే శ్రీశైలస్య ఈశాన్య ప్రదేశే కృష్ణాకావేర్యోః మధ్యప్రదేశే ( ఇచట ఏ ప్రాంతమువారు ఆ ప్రాంతము గురించి చెప్పుకోవాలి.) స్వగృహే (స్వగృహము లేనివారు వసతిగృహే అని, బాబా మందిరమైన సాయిబాబా మందిరే అని చెప్పుకోవాలి.) సాయిబాబా చరణసన్నిధౌ, అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన శ్రీ.... నామసంవత్సరే...... ఆయనే...... ఋతౌ...... మాసే..... పక్షే......తిథౌ...... వాసరే శుభనక్షత్రే ( యిచట సంవత్సరము, ఆయనము, ఋతువు, మాసము, పక్షము, తిథి, వారము ఏరోజున వ్రతం జరుగుచున్నదో ఆరోజువి చెప్పుకోవాలి) శుభయోగే శుభకరణ ఏవంగుణ విశేషణ విశిష్టాయాం శుభతిథౌ శ్రీమాన్ శ్రీమతః... గోత్రోద్భవస్య ............. (తనపేరు) నామధేయస్య, ధర్మపత్న్యాః ....... (భార్య పేరు) నామధేయపత్న్యాః సహకుటుంబానాం, (ఇచట వ్రతము చేసుకొనువారు ఎవరి గోత్రము, పేర్లు వారు చెప్పుకోవాలి) క్షేమ, స్థైర్య, విజయ, అభయ, ఆయురారోగ్య, ఐశ్వర్యాభివృద్ధ్యర్థం ధర్మార్థ కామమోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థం (ఇంకా మన మనస్సులో ఏవైనా కోరికలున్న వాటిని చెప్పుకోవాలి) సర్వాభీష్టసిద్ధ్యర్థం శ్రీ సాయినాథ ప్రసాదసిద్ధ్యర్థం యావచ్ఛక్తిధ్యాన ఆవాహనాది షోడశోపచార పూజాసహిత శ్రీసమర్థ సద్గురుశ్రీసాయినాథ వ్రతపూజాం కరిష్యే. (గ్లాసులోని నీటిని కుడిచేతి మధ్యవ్రేలితో తాకవలెను).

ఆదౌనిర్విఘ్నేన పరిసమాప్త్యర్థం శ్రీ మహాగణపతి పూజాం కరిష్యే. (మరల గ్లాసులోని నీటిని తాకవలెను.)

కలశపూజ : కలశమునకు ఉపయోగించుటకు నీటితో ఉంచిన గ్లాసునకు మూడువ్రక్కల గంధ కుంకుమలతో బొట్టు పెట్టి అక్షతలు అందులో వేసి, ఒక తమలపాకుగాని, పుష్పముగాని ఆ గ్లాసులో వేసుకొనవలెను. ఆ కలశపుగ్లాసుపై అరచేతిని కప్పి ఈ క్రింది శ్లోకమును చదువవలెను. (ఇది పూజకు ఉపయోగించు నీటిని పవిత్రము చేయుట)

కలశ దేవతాయై నమః

శ్లో॥ కలశస్య ముఖేవిష్ణుః కంఠే రుద్రస్సమాశ్రితః।

మూలే తత్ర స్థితో బ్రహ్మ మధ్యే మాతృ గణాస్మృతాః।

కుక్షౌతు సాగరాస్సర్వే సప్తద్వీపావసుంధరా।

ఋగ్వేదోఽ థయజుర్వేద స్సామవేదో హ్యథర్వణః॥

అఙ్గైశ్చ సహితాస్సర్వే కలశాంబుసమాశ్రితాః॥

ఆ కలశము పైనుంచి చేతిని తీసి, ఆ కలశములోని నీటిని ఆకుతోగాని, పూవుతోగాని త్రిప్పుచు ఈ క్రింది శ్లోకమును చదువవలెను.

శ్లో॥ గంగేచ యమునేచైవ (కృష్ణ) గోదావరి సరస్వతీ ।
నర్మదే సింధుకావేరి జలేస్మిన్ సన్నిధిం కురు॥

అయాస్తు శ్రీసాయినాథ వ్రతపూజార్థం మనుదురితక్షయకారకాః కలశోదకేన పూజాద్రవ్యాణి సంప్రోక్ష్య, (కలశములోని నీటిని పూజా ద్రవ్యముల మీద చల్లవలెను) దేవం సంప్రోక్ష్య (బాబా మీద, గణపతి మీద చల్లవలెను) ఆత్మానంచ సంప్రోక్ష్య ॥ (తమ మీద చల్లుకొనవలెను.)

మనము జరుపు పూజకు దేవతలను ఆహ్వానించుచు, రాక్షసులను పారద్రోలుటకు ఈ క్రింది శ్లోకముతో ఘంటానాదము (ఘంటను మ్రోగించుచు) చేయవలెను.

శ్లో॥ ఆగమార్థంతు దేవానాం గమనార్థంతు రాక్షసాం ।
కుర్యాద్ఘంటారవం తత్రదేవతాహ్వాన లాంఛనమ్ ॥

## గణపతి పూజా ప్రారంభము

బాబా పటమునకు ముందు తమలపాకులో ఉంచిన పసుపుముద్దను గణపతిగా భావించి పూజించవలెను.

| | | |
|---|---|---|
| ప్రాణప్రతిష్ఠ | : | గణపతిపై (ఆ పసుపు ముద్దపైన) కలశములోని తమలపాకును ఉంచి ఈ క్రింది మంత్రము చదువవలెను. |
| ధ్యానం | : | శ్రీ మహాగణాధిపతయే నమః - ధ్యాయామి, ధ్యానం సమర్పయామి. (అక్షతలు వేయవలెను). |
| ఆవాహనం | : | శ్రీమహాగణాధిపతిం ఆవాహయామి (అక్షతలు వేయవలెను). |
| ఆసనం | : | శ్రీ మహాగణాధిపతయే నమః సువర్ణ రత్నఖచిత సింహాసనమ్ సమర్పయామి. (అక్షతలు వేయవలెను). |
| పాద్యం | : | శ్రీమహాగణాధిపతయే నమః పాదయోః పాద్యం సమర్పయామి. (కలశములోని నీటిని ఉద్ధరిణెతో తీసికొని గణపతికి చూపి ముందు ఉండు పళ్ళెములో వదలవలెను.) |
| అర్ఘ్యం | : | శ్రీ మహాగణాధిపతయే నమః హస్తయోః అర్ఘ్యం సమర్పయామి. (నీటిని వదలవలెను) |
| స్నానం | : | శ్రీ మహాగణాధిపతయే నమః స్నానం సమర్పయామి. (నీటిని వదలవలెను.) స్నానానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి. (నీటిని వదలవలెను). |
| వస్త్రం | : | శ్రీమహాగణాధిపతయే నమః వస్త్రయుగ్మం సమర్పయామి. (ప్రత్తితో చేసినవి రెండు వేయవలెను). వస్త్రానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి (నీటిని వదలవలెను). |
| యజ్ఞోపవీతం | : | శ్రీమహాగణాధిపతయే నమః యజ్ఞోపవీతం సమర్పయామి. (పత్తితో చేసిన వస్త్రం వేయవలెను) |
| గంధం | : | శ్రీమహాగణాధిపతయే నమః గన్ధాన్ ధారయామి. (గంధమును వ్రేళ్ళతో చల్లవలెను). |

శ్రీమహాగణాధిపతయే నమః గంధస్యోపరి అలంకరణార్థం అక్షతాన్ సమర్పయామి. (అక్షతలు వేయవలెను.)

శ్రీ మహాగణాధిపతయే నమః పుష్పైః పూజయామి.(పూలు వేయవలెను.)

ఈ క్రింది నామములు చెప్పుచు పుష్పములతోగాని, అక్షతలతోగాని పూజచేయవలెను.

1. ఓం సుముఖాయ నమః 9. ఓం ధూమ్రకేతవే నమః

2. ఓం ఏకదంతాయ నమః 10. ఓం గణాధ్యక్షాయ నమః

3. ఓం కపిలాయ నమః 11. ఓం ఫాలచంద్రాయ నమః

4. ఓం గజకర్ణికాయ నమః 12. ఓం గజాననాయ నమః

5. ఓం లంబోదరాయ నమః 13. ఓం వక్రతుండాయ నమః

6. ఓం వికటాయ నమః 14. ఓం శూర్పకర్ణాయ నమః

7. ఓం విఘ్నరాజాయ నమః 15. ఓం హేరంబాయ నమః

8. ఓంగణాధిపాయ నమః 16.ఓం స్కంధపూర్వజాయ నమః

ఓం మహాగణాధిపతయే నమః షోడశనామ పూజాం సమర్పయామి.

ధూపం : శ్రీ మహాగణాధిపతయే నమః ధూపమాఘ్రా పయామి. (అగరువత్తులు వెలిగించి ఆ పొగనుచూపవలెను).

దీపం : శ్రీమహాగణాధిపతయేనమః దీపం దర్శయామి. (దీపమునకు నమస్కారము చేయవలెను).

ధూపదీపానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి.

(నీటిని పళ్ళెములో వదలవలెను).

నైవేద్యము : బెల్లముకాని, అరటిపండుకాని నైవేద్యము పెట్టవలెను. అవిలేనిచో ఆ సమయమునకు లభించిన ఫలమును ఉపయోగించవలెను.

ఆ నైవేద్యముపై నీటిని చల్లుచు ఈ మంత్రము చెప్పవలెను.

ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్. (నీళ్లను నైవేద్యము చుట్టు త్రిప్పుచు ఈ మంత్రం చెప్పవలెను). సత్యం త్వర్తేన పరిషించామి.

అమృతమస్తు, అమృతోపస్తరణమసి (అనుచు నీటిని ఉద్ధరిణెతో పళ్ళెములో రెండుసార్లు వదలవలెను)

శ్రీ మహాగణాధిపతయేనమః గుడోపహార (బెల్లం) నైవేద్యం సమర్పయామి (అని చెప్పి చేతులతో ఆ నైవేద్యమును గణపతికి ఈ క్రింది మంత్రముతో చూపవలెను).

1. ఓం ప్రాణాయ స్వాహా 2. ఓం అపానాయ స్వాహా

3. ఓం వ్యానాయ స్వాహా 4. ఓం ఉదానాయ స్వాహా

5. ఓం సమానాయ స్వాహా

మధ్యే మధ్యే పానీయం సమర్పయామి,

ఉత్తరాపోశనం సమర్పయామి,

హస్తప్రక్షాళనం సమర్పయామి, పాదప్రక్షాళనం సమర్పయామి,

శుద్ధాచమనీయం సమర్పయామి.

ఉద్ధరిణెతో ఐదుసార్లు నీటిని తీసికొని పళ్ళెములోవదలవలెను.

తాంబూలం : శ్రీమహాగణాధిపతయే నమః తాంబూలం సమర్పయామి. (తమలపాకు, వక్క, చిల్లర డబ్బులు, ఫలము వుంచాలి) లేచి నుంచొనవలెను.

కర్పూర నీరాజనం : శ్రీమహాగణాధిపతయే నమః కర్పూర నీరాజనం సమర్పయామి. (కర్పూరం వెలిగించి చూపి, ఆ జ్యోతిని గణపతికి అద్దవలెను). నీరాజనానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి. నీటిని వదలి - అందరు ఆ జ్యోతిని కండ్లకద్దుకొనవలెను.

మంత్రపుష్పం : చేతిలోనికి అక్షతలు, పూలు తీసుకొని

శ్రీమహాగణాధిపతయే నమః సువర్ణ దివ్యమంత్రపుష్పం సమర్పయామి.

(ఆ అక్షతలు, పూలు గణపతి ముందు ఉంచవలెను).

ఆత్మ ప్రదక్షిణం : శ్రీమహాగణాధిపతయే నమః ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి. (మూడుసార్లు తనచుట్టూ తానుతిరుగ వలెను). ఈ క్రింది మంత్రమును అక్షతలువేస్తూ చెప్పవలెను.

శ్రీ మహాగణాధిపతయే నమః ఛత్రం ఆఛ్ఛాదయామి, చామరం వీజయామి, గీతా వాద్యాది సమస్త రాజోపచార, సకలోపచార పూజాం సమర్పయామి.

ఫలసిద్ధి: అక్షతలు, నీళ్ళు చేతిలోనికి తీసుకొనవలెను.

అనయా, ధ్యాన, ఆవాహనాది షోడశోపచార పూజయాచ, భగవాన్‌సర్వాత్మకః శ్రీ మహాగణపతి సుప్రీతః సుప్రసన్నో వరదో భూత్వా. (చేతిలోని నీళ్ళు ముందు పళ్ళెములో వదలి, అక్షతలువిఘ్నేశ్వరుని వద్ద యుంచవలెను.) అటుపిమ్మట ఉత్తరే శుభకర్మణ్యా విఘ్నమస్త్వితి శ్రీమహా గణాధిపతి ప్రసాదం శిరసాగృహ్ణామి అని చెప్పి స్త్రీలు పూజ చేసిన పువ్వులు తలలో పెట్టుకొనవలెను. పురుషులు ఆ పూజ అక్షతలుతలపై వేసుకొనవలెను.

ప్రార్థనా పూర్వక నమస్కారము ఈక్రింది శ్లోకం చదువుచు చేయవలెను.

శ్లో॥ వక్రతుండ మహాకాయ సూర్యకోటిసమప్రభ।
అవిఘ్నంకురు మే దేవ సర్వకార్యేషు సర్వదా ॥

ఉద్వాసనమ్ (విఘ్నేశ్వరుడు వున్న తమలపాకును పట్టుకొని)

యజ్ఞేన యజ్ఞమయ జన్త దేవాస్తాని
ధర్మాణి ప్రథమాన్యాసన్ తేహనాకం మహి
మాన స్సచన్తే యత్రపూర్వే సాధ్యాసన్తిదేవాః
శ్రీమహాగణపతిం యథాస్థానం ప్రవేశయామి.
శోభనార్థం పునరాగమనాయచ -

అనుచు తమలపాకును విఘ్నేశ్వరునితో సహా ముందుకు జరుపవలెను.

విఘ్నేశ్వర పూజ సమాప్తం

## సాయిబాబా పూజా ప్రారంభము

పూజలో చేయు కలాపము విఘ్నేశ్వర పూజలో చేసిన విధముగా ఆయా మంత్రములు చెప్పునప్పుడు చేయవలెను.

ఆచమనము : మూడుసార్లు నీటిని తీసికొనుచు ఈ మంత్రములు చెప్పవలెను.

1. ఓం కేశవాయస్వాహా

2. ఓం నారాయణాయ స్వాహా 3. ఓంమాధవాయస్వాహా

చేతులు కడుగుకొనవలెను. భార్య కూడ ఆచమనము చేయవలెను. ఈ క్రింది నామములు చెప్పుచు బాబాకు నమస్కారము చేయవలెను.

4. ఓం గోవిందాయ నమః 5. ఓం విష్ణవే నమః

6. ఓం మధుసూదనాయ నమః 7. ఓం త్రివిక్రమాయ నమః

8. ఓం వామనాయ నమః 9. ఓం శ్రీధరాయ నమః

10. ఓం హృషీకేశాయ నమః 11. ఓం పద్మనాభాయ నమః

12. ఓం దామోదరాయ నమః 13. ఓం సంకర్షణాయ నమః

14. ఓం వాసుదేవాయ నమః 15. ఓం ప్రద్యుమ్నాయ నమః

16. ఓం అనిరుద్ధాయ నమః 17. ఓంపురుషోత్తమాయ నమః

18. ఓం అధోక్షజాయ నమః 19. ఓం నారసింహాయ నమః

20. ఓం అచ్యుతాయ నమః 21. ఓం జనార్ధనాయ నమః

22. ఓం ఉపేంద్రాయ నమః 23. ఓం హరయే నమః

24. ఓం శ్రీకృష్ణాయ నమః

ఎదుట బాబాయే స్వయముగా ఉన్నాడని గ్రహించి ఈ క్రింది విధముగా బాబాకు 16 ఉపచారములు చేయవలెను.

ప్రాణప్రతిష్ఠ : హే సాయినాథ । స్థిరోభవ, వరదోభవ, సుప్రసన్నోభవ, స్థిరాసనం కురు. (అక్షతలు వేయవలెను).

ధ్యానం : నమస్కారము చేయుచు ఈ క్రింది శ్లోకములు చెప్పవలెను.

శ్లో॥ బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాదిలక్ష్యం ।
ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం
సాయినాథం త్రిగుణరహితం సద్గురుం తం నమామి ॥

శ్లో॥ త్వమేవమాతాచ పితాత్వమేవ
త్వమేవబంధుశ్చ సఖాత్వమేవ
త్వమేవవిద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమదేవ దేవ ॥

సాయిదేవ శ్రీసాయినాథాయ నమః ధ్యానం సమర్పయామి.

గమనిక : మనము వేసే పూలు, అక్షతలు బాబాపాదములపైననే వేయవలెను. కలశములోని నీళ్ళు బాబాకు ఉద్ధరిణెతో చూపుచూ ముందు వున్నపళ్ళెములో పోయవలెను).

ఆవాహనం : ఆహ్వానించుట

శ్రీ సాయినాథాయ నమః ఆవాహనం సమర్పయామి. (పూలు, అక్షతలు వేయవలెను).

| | | |
|---|---|---|
| ఆసనం | : | కూర్చొనుట<br>శ్రీసాయినాథాయనమః ఆసనం సమర్పయామి (పూలు, అక్షతలువేయవలెను). |
| పాద్యం | : | శ్రీసాయినాథాయనమః పాద్యం సమర్పయామి. (నీరు ఉద్ధరిణెతో చల్లుట లేక చూపి పళ్ళెములోపోయుట) |
| అర్ఘ్యం | : | శ్రీసాయినాథాయనమః అర్ఘ్యం సమర్పయామి (నీళ్లు చూపి పళ్ళెములో పోయాలి). |
| ఆచమనీయం | : | శ్రీసాయినాథాయనమః ఆయమనీయం సమర్పయామి. (నీళ్ళు చూపి పళ్ళెములో పోయాలి). |
| మధుపర్కం | : | శ్రీసాయినాథాయనమః మధుపర్కం సమర్పయామి. (ప్రత్తితో చేసి బాబా మీద ఉంచవలెను). |
| పంచామృత స్నానం | | : పటమైన పంచామృతములను ఉద్ధరిణెతో బాబాకు చూపిముందున్న పళ్ళెములో పోయవలెను, అదే బాబా చిన్న విగ్రహమైన ఆ విగ్రహముపై పోసి మంగళస్నానము చేయించవలెను. అలా పోసేటప్పుడు ఓం శ్రీసాయినాథాయ నమః అని 3 సార్లు, 5 సార్లు, 9 సార్లు లేక 11 సార్లు చొప్పున ప్రతిసారి అనుచు చేయవలెను. |

శ్రీసాయినాథాయనమః పంచామృతస్నానం సమర్పయామి. కొబ్బరికాయకొట్టి ఆనీటితో చేయవలెను.

| | | |
|---|---|---|
| క్షీరస్నానం | : | ఆవుపాలతో<br>శ్రీసాయినాథాయ నమః క్షరస్నానం సమర్పయామి. |
| దధిస్నానం | : | ఆవు పెరుగుతో<br>శ్రీసాయినాథాయనమః దధిస్నానం సమర్పయామి. |
| ఘృతస్నానం | : | ఆవునెయ్యితో<br>శ్రీసాయినాథాయనమః ఘృతస్నానం సమర్పయామి. |
| మధుస్నానం | : | తేనెతో<br>శ్రీసాయినాథాయనమః మధుస్నానంసమర్పయామి. |
| శర్కరస్నానం | : | పంచదారతో<br>శ్రీసాయినాథాయనమః శర్కరస్నానం సమర్పయామి. |
| శుద్ధోదకస్నానం | : | మాలిన్యములు తొలగించుటకు నీటితో చేయవలెను.<br>శ్రీసాయినాథాయనమః శుద్ధోదకస్నానం సమర్పయామి.<br>శ్రీసాయినాథాయనమః మంగళోదకస్నానం సమర్పయామి.<br>ఇప్పుడు బాబా విగ్రహమును కడిగి గంధము, కుంకుమలతో అలంకరించవలెను. |
| వస్త్రం | : | ప్రత్తితో రెండుగా చేసి, గంధముతో తడిపి, కుంకుమను అద్ది సమర్పించవలెను. (ప్రత్తి లేనిచో అక్షింతలు వేయవలెను).<br>శ్రీసాయినాథాయనమః వస్త్రయుగ్మం సమర్పయామి. |
| యజ్ఞోపవీతము | : | అనగా జంధ్యము. ప్రత్తితో పొడవుగా మధ్య మధ్య కుంకుమ అద్దుచూ తయారుచేయవలెను. |

శ్రీసాయినాథాయనమః యజ్ఞోపవీతం సమర్పయామి.

గంధం : వ్రేళ్ళతో గంధమును చల్లవలెను.

శ్రీసాయినాథాయ నమః శ్రీగంధం సమర్పయామి.

(కుంకుమ చల్లవలెను)

శ్రీసాయినాథాయనమః అక్షతాన్ సమర్పయామి.

పుష్పైః పూజయామి (శ్రీసాయినాథాయ నమః తులసీదళ సహిత నానావిధ పరిమళ పుష్పాణి సమర్పయామి.)

## అథాంగపూజా

పుష్పములతోగాని, అక్షతలతోగాని పూజించవలెను. శ్రీసాయినాథుని శరీరములోని అన్నిఅవయవములనుపూజించుచు ఆవాహనచేయవలెను.

1. ఓం శ్రీసాయి సాయినాథాయనమః పాదౌపూజయామి
   పాదములనుపూజించవలెను.
2. ఓం శ్రీసాయి భవబంధ వినాశకాయ నమః గుల్ఫౌ పూజ యామి
   చీలమండలమును పూజించవలెను.
3. ఓం శ్రీసాయి షిరిడీ నివాసినేనమః జంఘౌ పూజయామి
   పిక్కలనుపూజించవలెను.
4. ఓం శ్రీసాయి భక్తావన ప్రతిజ్ఞాయ నమః జానునీ పూజయామి
   మోకాళ్ళను పూజించవలెను.
5. ఓం శ్రీసాయి సర్వాధారాయ నమః ఊరూపూజయామి
   తొడలనుపూజించవలెను.
6. ఓం శ్రీసాయి సాధురూపాయ నమః జఘనం పూజయామి
   జఘనమును పూజించవలెను.
7. ఓం శ్రీసాయి భక్తిప్రబోధకాయ నమః కటిం పూజయామి
   తొంటిని పూజించవలెను.
8. ఓం శ్రీసాయి సర్వమత సమ్మతాయ నమః మధ్యమం పూజయామి
   నడుమునుపూజించవలెను.
9. ఓం శ్రీసాయి బ్రహ్మచర్యప్రభాసితాయనమః ఉదరం పూజయామి.
   పొట్టనుపూజించవలెను.
10. ఓం శ్రీసాయి తాపస శ్రేష్ఠాయ నమః హృదయం పూజయామి
    హృదయమును పూజించవలెను.
11. ఓం శ్రీసాయి నిరాడంబరాయ నమః హస్తౌపూజయామి
    చేతులను పూజించవలెను.
12. ఓం శ్రీ సాయి సర్వభూతాంతర్యామినే నమః బాహూ పూజయామి

బాహువులను పూజించవలెను.

13. ఓం శ్రీసాయి భక్తాభీష్టప్రదాయ నమః స్కంధౌ పూజయామి
భుజములనుపూజించవలెను.

14. ఓం శ్రీసాయి ముక్తిప్రదాయ నమః కంఠం పూజయామి
కంఠమును పూజించవలెను.

15. ఓం శ్రీసాయి జ్ఞానబోధకాయ నమః చుబుకం పూజయామి
గడ్డమును పూజించవలెను.

16. ఓం శ్రీసాయి అధివ్యాధినిర్మూలనాయ నమః అధరోష్ఠం పూజయామి.
పెదవిని పూజించవలెను.

17. ఓం శ్రీసాయి భూతఘనభౌషజ్యాయ నమః ముఖం పూజయామి
నోటిని పూజించవలెను.

18. ఓం శ్రీసాయి నింబవృక్షమూలతలంగతాయ నమ : నాసికాం పూజ యామి
ముక్కును పూజించవలెను.

19. ఓం శ్రీసాయి సమస్త సురమూర్తయే నమః నేత్రౌ పూజయామి
కన్నులను పూజించవలెను.

20. ఓం శ్రీసాయి గురుభక్తిప్రదాయ నమః కర్ణౌ పూజయామి
చెవులనుపూజించవలెను.

21. ఓంశ్రీసాయి బహురూపవిశ్వమూర్తయే నమః ఫాలం పూజయామి
నుదుటిని పూజించవలెను.

22. ఓం శ్రీసాయి పుణ్యశ్రవణకీర్తనాయ నమ ః కేశాని పూజయామి
వెంట్రుకలను పూజించవలెను.

23. ఓం శ్రీసాయి ప్రసన్నార్తిహరాయ నమః శిరః పూజయామి
శిరస్సును పూజించవలెను.

24. ఓం శ్రీసాయి ప్రేమరూపాయ నమః సర్వాణ్యంగాని పూజయామి
సర్వావయవములను పూజించవలెను.

## శ్రీసాయిబాబా అష్టోత్తర శతనామావళి

ఈ క్రింది నామములతో పూలు, అక్షతలను బాబా పాదములపై వేయుచు పూజ చేయవలెను.

1. ఓం శ్రీసాయి సాయినాథాయ నమః
2. ఓం శ్రీసాయి శ్రీలక్ష్మీనారాయణాయ నమః
3. ఓం శ్రీసాయి శ్రీకృష్ణశివమారుత్యాది రూపాయ నమః
4. ఓం శ్రీసాయి శేషసాయినే నమః
5. ఓం శ్రీసాయి గోదావరీతట షిరిడీవాసినేనమః
6. ఓం శ్రీసాయి భక్తహృదయాలయాయనమః

7. ఓం శ్రీసాయి సర్వహృన్నిలయాయ నమః
8. ఓం శ్రీసాయి భూతవాసాయ నమః
9. ఓం శ్రీసాయి భూత భవిష్యద్భావ వర్జితాయ నమః
10. ఓం శ్రీసాయి కాలాతీతాయ నమః
11. ఓం శ్రీసాయి కాలాయ నమః
12. ఓం శ్రీసాయి కాలకాలాయ నమః
13. ఓం శ్రీసాయి కాలదర్పదమనాయ నమః
14. ఓం శ్రీసాయి మృత్యుంజయాయ నమః
15. ఓం శ్రీసాయి అమర్త్యాయ నమః
16. ఓం శ్రీసాయి మర్త్యాభయ ప్రదాయనమః
17. ఓం శ్రీసాయి జీవాధారాయ నమః
18. ఓం శ్రీసాయి సర్వాధారాయ నమః
19. ఓం శ్రీసాయి భక్తావనసమర్థాయ నమః
20. ఓం శ్రీసాయి భక్తావన ప్రతిజ్ఞాయ నమః
21. ఓం శ్రీసాయి అన్నవస్త్రదాయ నమః
22. ఓం శ్రీసాయి ఆరోగ్యక్షేమదాయ నమః
23. ఓం శ్రీసాయి ధనమాంగల్య ప్రదాయ నమః
24. ఓం శ్రీసాయి వృద్ధిసిద్ధిదాయ నమః
25. ఓం శ్రీసాయి పుత్రమిత్ర కళత్ర బంధుదాయ నమః
26. ఓం శ్రీసాయి యోగక్షేమ వహాయ నమః
27. ఓం శ్రీసాయి ఆపద్బాంధవాయ నమః
28. ఓం శ్రీసాయి మార్గబంధవే నమః
29. ఓం శ్రీసాయి భక్తి ముక్తి స్వర్గాపవర్గప్రదాయ నమః
30. ఓం శ్రీసాయి ప్రియాయ నమః
31. ఓం శ్రీసాయి ప్రీతివర్ధనాయ నమః
32. ఓం శ్రీసాయి అంతర్యామినే నమః
33. ఓం శ్రీసాయి సచ్చిదాత్మనే నమః
34. ఓం శ్రీసాయి నిత్యానందాయ నమః
35. ఓం శ్రీసాయి పరమసుఖదాయ నమః
36. ఓం శ్రీసాయి పరమేశ్వరాయ నమః
37. ఓం శ్రీసాయి పరబ్రహ్మణే నమః
38. ఓం శ్రీసాయి పరమాత్మనే నమః
39. ఓం శ్రీసాయి జ్ఞానస్వరూపిణే నమః

40. ఓం శ్రీసాయి జగతః పిత్రే నమః
41. ఓం శ్రీసాయి భక్తానాం మాతృపితృ పితామహాయ నమః
42. ఓం శ్రీసాయి భక్తాభయప్రదాయ నమః
43. ఓం శ్రీసాయి భక్తవత్సలాయ నమః
44. ఓం శ్రీసాయి భక్తానుగ్రహ కారకాయ నమః
45. ఓం శ్రీసాయి శరణాగతవత్సలాయ నమః
46. ఓం శ్రీసాయి భక్తి శక్తిప్రదాయ నమః
47. ఓం శ్రీసాయి జ్ఞానవైరాగ్యప్రదాయ నమః
48. ఓం శ్రీసాయి ప్రేమ ప్రదాయ నమః
49. ఓం శ్రీసాయి సంసార దౌర్బల్యపాపకర్మవాసనాక్షయకరాయ నమః
50. ఓం శ్రీసాయి హృదయగ్రంథి భేధకాయ నమః
51. ఓం శ్రీసాయి కర్మధ్వంసినే నమః
52. ఓం శ్రీసాయి శుద్ధసత్త్వస్థితాయ నమః
53. ఓం శ్రీసాయి గుణాతీత గుణాత్మనే నమః
54. ఓం శ్రీసాయి అనంతకల్యాణ గుణాయ నమః
55. ఓం శ్రీసాయి అమితపరాక్రమాయ నమః
56. ఓం శ్రీసాయి జయినే నమః
57. ఓం శ్రీసాయి దుర్ధర్షక్షోభ్యాయ నమః
58. ఓం శ్రీసాయి అపరాజితాయ నమః
59. ఓం శ్రీసాయి త్రిలోకేష్వస్కంధితగతయే నమః
60. ఓం శ్రీసాయి అశక్యరహితాయ నమః
61. ఓం శ్రీసాయి సర్వశక్తిమూర్తయే నమః
62. ఓం శ్రీసాయి సురూపసుందరాయ నమః
63. ఓం శ్రీసాయి సులోచనాయ నమః
64. ఓం శ్రీసాయి బహురూపవిశ్వమూర్తయే నమః
65. ఓం శ్రీసాయి అరూపావ్యక్తాయ నమః
66. ఓం శ్రీసాయి అచింత్యాయ నమః
67. ఓం శ్రీసాయి సూక్ష్మాయ నమః
68. ఓం శ్రీసాయి సర్వాంతర్యామినే నమః
69. ఓం శ్రీసాయి మనోవాగతీతాయ నమః
70. ఓం శ్రీసాయి ప్రేమమూర్తయేనమః
71. ఓం శ్రీసాయి సులభదుర్లభాయ నమః
72. ఓం శ్రీసాయి అసహాయ సహాయాయ నమః

73. ఓం శ్రీసాయి అనాథనాథ దీనబంధవే నమః
74. ఓం శ్రీసాయి సర్వభారభృతే నమః
75. ఓం శ్రీసాయి అకర్మానేక సుకర్మణే నమః
76. ఓం శ్రీసాయి పుణ్యశ్రవణ కీర్తనాయ నమః
77. ఓం శ్రీసాయి తీర్థాయ నమః
78. ఓం శ్రీసాయి వాసుదేవాయ నమః
79. ఓం శ్రీసాయి సతాంగతయే నమః
80. ఓం శ్రీసాయి సత్పరాయణాయ నమః
81. ఓం శ్రీసాయి లోకనాథాయ నమః
82. ఓం శ్రీసాయి పావనానఘాయ నమః
83. ఓం శ్రీసాయి అమృతాంశవే నమః
84. ఓం శ్రీసాయి భాస్కరప్రభాయ నమః
85. ఓం శ్రీసాయి బ్రహ్మచర్య తపశ్చర్యాది సువ్రతాయ నమః
86. ఓం శ్రీసాయి సత్యధర్మపరాయణాయ నమః
87. ఓం శ్రీసాయి సిద్ధేశ్వరాయ నమః
88. ఓం శ్రీసాయి సిద్ధి సంకల్పాయ నమః
89. ఓం శ్రీసాయి యోగేశ్వరాయ నమః
90. ఓం శ్రీసాయి భగవతే నమః
91. ఓం శ్రీసాయి భక్తవశ్యాయ నమః
92. ఓం శ్రీసాయి సత్పురుషాయ నమః
93. ఓం శ్రీసాయి పురుషోత్తమాయ నమః
94. ఓం శ్రీసాయి సత్యతత్త్వబోధాయ నమః
95. ఓం శ్రీసాయి కామాది సర్వ అజ్ఞానధ్వంసినే నమః
96. ఓం శ్రీసాయి అభేదానందానుభవ ప్రదాయ నమః
97. ఓం శ్రీసాయి సమసర్వమత సమ్మతాయ నమః
98. ఓం శ్రీసాయి శ్రీదక్షిణామూర్తయే నమః
99. ఓం శ్రీసాయి శ్రీవేంకటేశ రమణాయ నమః
100. ఓం శ్రీసాయి అద్భుతానంతచర్యాయ నమః
101. ఓం శ్రీసాయి ప్రసన్నార్తిహరాయ నమః
102. ఓం శ్రీసాయి సంసార సర్వదుఃఖ క్షయకరాయ నమః
103. ఓం శ్రీసాయి సర్వవిత్సర్వతోముఖాయ నమః
104. ఓం శ్రీసాయి సర్వాంతర్బహిస్థితాయ నమః
105. ఓం శ్రీసాయి సర్వమంగళకరాయ నమః

106. ఓం శ్రీసాయి సర్వాభీష్టఫలప్రదాయ నమః

107. ఓం శ్రీసాయి సమరసన్మార్గ స్థాపనాయ నమః

108. ఓం శ్రీసాయి సమర్థ సద్గురు శ్రీసాయినాథాయ నమః

ఓం శ్రీసాయి సమర్థ సద్గురు శ్రీసాయినాథాయ నమః

ఓం శ్రీసాయి సమర్థ సద్గురు శ్రీసాయినాథాయ నమః

శ్రీ సాయినాథ అష్టోత్తర శతనామ పూజాం సమర్పయామి.

ధూపం : అగరుబత్తులు వెలిగించి పొగను చూపవలెను.

శ్రీసాయినాథాయ నమః ధూపమాఘ్రాపయామి.

దీపం : ఒక వత్తి వెలిగించి చూపవలెను. లేనిచో వెలిగించి ఉన్నదీపమునకు నమస్కరించవలెను.

శ్రీసాయినాథాయ నమః దీపం దర్శయామి.

దీపానంతరం శుద్ధ ఆచమనీయం సమర్పయామి. (నీటిని పళ్ళెములో వదలవలెను).

నైవేద్యం : నారికేళం మొదలగునవి అవసర నైవేద్యం పెట్టవలెను. వ్రతకథలు పూర్తిఅయిన తరువాత మహానైవేద్యము పెట్టవచ్చును. పదార్థములపై నీళ్ళు చల్లుచూ ఈ మంత్రము చెప్పవలెను. ఓం భూర్భువస్సువః ఓం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ (నీటిని పదార్థముల చుట్టు త్రిప్పుచు) సత్యం త్వర్తేన పరిషించామి. (పళ్ళెములో రెండుసార్లు నీళ్ళు వదలుచు) అమృతమస్తు, అమృతోపస్తరణమసి, శ్రీ సమర్థసద్గురు శ్రీసాయినాథాయ నమః అవసరార్థం నారికేళ, కదళీఫల, వడపప్పు, పానకం (నైవేద్యం పెట్టేవాటిని ఇచ్చుట చెప్పవలెను). అవసర నైవేద్యం సమర్పయామి. పదార్థములను చేతితో బాబాకు చూపుచు ఈ మంత్రము చెప్పవలెను.

1. ఓం ప్రాణాయస్వాహా 2. ఓం అపానాయ స్వాహా 3. ఓం వ్యానాయస్వాహా 4. ఓం ఉదానాయ స్వాహా 5. ఓం సమానాయ స్వాహా మధ్యే మధ్యే పానీయం సమర్పయామి : ఉత్తరాపోశనం సమర్పయామి, హస్తప్రక్షాళనం సమర్పయామి, పాదప్రక్షాళనం సమర్పయామి, శుద్ధాచమనీయం సమర్పయామి. (అని చెప్పుచు ఉద్ధరిణెతో కలశము లోని నీటిని ఐదుసార్లు ముందున్న పళ్ళెములో వదల వలెను).

తాంబూలం : తమలపాకులలో వక్క చిల్లరడబ్బు, పండు ఉంచి బాబాముందు ఉంచవలెను.

శ్రీ సాయినాథాయ నమః తాంబూలం సమర్పయామి.

కర్పూర నీరాజనం : లేచి నుంచొని ఏకహారతిలో కర్పూరము వెలిగించి బాబాకు చూపుతూ శ్రీసాయినాథాయ నమః కర్పూర నీరాజనం సమర్పయామి (అని చెప్పి బాబాకు కర్పూరజ్యోతిని చేతులతో అద్ది) నీరాజనానంతరం శుద్ధ ఆచమనీయ సమర్పయామి (అని ఒక ఉద్ధరిణెడు నీటిని పళ్ళెములో వదలి అందరు ఆ జ్యోతిని కళ్ళకు అద్దుకొనవలెను).

మంత్రపుష్పము : వ్రతకథలు పూర్తిఅయిన తరువాత మంత్రపుష్పం చదవవచ్చును. అక్షతలు చేతిలోకి తీసికొని శ్రీ సమర్థ సద్గురు సాయినాథాయ నమః పాదయోః దివ్యమంత్రపుష్పము సమర్పయామి. (అక్షతలు - పూలు బాబా పాదములపై ఉంచి నమస్కారము చేసుకొనవలెను.)

గమనిక : ఆత్మప్రదక్షిణ నమస్కారము, ప్రార్థన వ్రతకథలుపూర్తి అయిన తరువాత చివరలో చేయవలెను - ఇక వ్రతకథలు ప్రారంభించవలెను.

సాయిసత్యవ్రతము - వ్రతకథలు

మొదటి అధ్యాయము

కథా ప్రారంభము

కథాప్రారంభములో వ్రతములో పాల్గొను దంపతులు, అచ్చట కూర్చునియున్న యితరభక్తులు అక్షతలను చేతిలోనికి తీసికొని యుంచుకొనవలెను. మనస్సును ఈకథలయందు లగ్నముచేసి భక్తి శ్రద్ధలతో వినవలెను. కథలు వినుటయందు శ్రద్ధలేనిచో నిష్ప్రయోజనమని గమనించవలెను.

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥

శ్రీ షిరిడి సాయిబాబాకు శతకోటి నమస్కారములు సమర్పించుకొనుచు శ్రీసాయి సత్యవ్రత కథలను శ్రవణము చేయుడని పౌరాణికుండు శ్రోతలకు ఇట్లు చెప్పనారంభించెను.

దత్తాత్రేయస్వామి తన అవతార కార్యమును కొనసాగించుచు ఈ కలియుగములో మానవులనుద్ధరించుటకు శ్రీపాద శ్రీవల్లభుడుగా, శ్రీనృసింహ సరస్వతిగా, శ్రీమాణిక్యప్రభువుగా, శ్రీఅక్కలకోటసమర్థగా అవతరించిరి.

దత్తాత్రేయుడు ఈ నాలుగుసార్లు కలియుగములో తన అంశమున ప్రకటన అయినప్పటికి కలిప్రభావము వలన ఆశించిన ఫలితము కలుగలేదు. మతముల మధ్య మత వైషమ్యములు పెచ్చు పెరుగుటయే కాని సమసిపోవుట లేదు. పరిపాలకులలో నీతినియమములు లోపించినవి. పరప్రభుత్వ పరిపాలనలో ప్రజలు అష్ట కష్టములకు లోనగుచున్నారు. ఆహార సంపాదనయందు పడరాని పాట్లు పడుచున్నారు. దురాచారుల - చోరుల - నీతిబాహ్యుల మాటలకు విలువ ఏర్పడసాగినది. భగవత్‌చింతన కనుమరుగగుచున్నది. హేతువాద మధికమైనది. సాత్వికగుణము మచ్చునకు కూడ కానరాకున్నది. ధర్మమను మాటయే మృ గ్యమైనది. అధర్మము దేశమందంతట తాండవము చేయసాగినది.

ఇట్టి దుర్భర పరిస్థితులలో దత్తాత్రేయస్వామి, పైన తెలిపిన నాలుగుసార్లు సాధురూపమున, సామాన్య మానవుని వలె, సోదరునిగా మానవుల మధ్య తీసికొని రానిదే ప్రయోజనము లేదని నిశ్చయించి, ఈ కలియుగములో 5వ సారి 19వ శతాబ్దములోనే షోడశ కళలతో పరిపూర్ణావతారియైన శ్రీ షిరిడీ సాయిబాబాగా అవతరించిరి.

అక్కలకోట మహారాజుగారి భక్తుడైన భాయి కృష్ణజీ ఆలిబాగ్‌కర్ ఒకసారి అక్కల్‌కోట వెళ్ళి అక్కల్‌కోట మహారాజ్‌గారి పాదుకలను దర్శించి పూజించవలెనని తలచెను. అచటికి వెళ్ళకమునుపే యితనికి అక్కల కోటస్వామి స్వప్నమున దర్శనమిచ్చి ప్రస్తుతము షిరిడీ నా నివాస స్థలము. అచ్చటికి పోయి నీపూజ

యొనరింపుము అని చెప్పిరి. అట్లే 1912 లో కృష్ణజీ షిరిడీ వెళ్ళి బాబా దర్శనము చేసికొనెను. బాబా దర్శనము చేసికొనిన తరువాత భాయికృష్ణజి అక్కల్‌కోట గ్రామము వెళ్ళవలెనని మరల తలచెను. బాబా వద్దకు వెళ్ళి అక్కలకోట వెళ్ళుటకు అనుమతి యివ్వమని బాబాను కోరెను. అక్కల్ కోటలో నేమున్నది ? అక్కడకేల పోయెదవు ? అక్కడయుండే మహారాజు ప్రస్తుతము యిక్కడ యున్నారు. వారేనేను అని బాబా భాయికృష్ణజీతో చెప్పగ అతడు అక్కల్‌కోట వెళ్ళుట మానుకొనెను. అందువలన ఎక్కువగా సాయిభక్తులు దత్తావతార గురుపరంపరగా బాబాకు తలచుచుండిరి.

దయామయుడైన పరమాత్మకు అందరు సమానులే. వారికి భేదభావము లేదు. ఏ మతములోనో, ఏ కులములోనో, ఏ పుణ్యదంపతులకో జన్మింపక, మానవత్వమే మతముగా, అయోనిజుడై మానవుల నుద్ధరించుచు, దుర్మార్గులను సహితము దండించక సన్మార్గులను చేయుచు, తన ఉనికినే సందేహించి, శక్తిని శంకించి అనుమానములతో పెనుగులాడుచున్న వారిని గూడ ఆదరించి అనుగ్రహించుచున్న ప్రేమావతారమే శ్రీ షిరిడీసాయిబాబా వారుసకలదేవతా స్వరూపులు, సర్వవ్యాపకులు, సమర్థసద్గురువు.

మన భారతదేశములో మహారాష్ట్ర దేశమున అహమద్‌నగర్ జిల్లా కోపర్‌గాం తాలూకాలో పవిత్ర గోదావరి తీరమున షిరిడీ అను గ్రామము గలదు. నాటికి అందు 80కి మించని మట్టితో కట్టిన పూరి యిండ్లు మాత్రము గలవు. ఇతర ప్రపంచమే తెలియని అమాయకులు నాటి షిరిడీవాసులు. ఈ షిరిడీగ్రామమునకు ఉత్తరదిక్కున యున్న ఒక వేపచెట్టు క్రింద క్రీ.శ. 1854వ సం॥లో మొదటిసారిగా సాయిబాబా కనుపించిరి. అప్పటికి 16సం॥ల వయస్సు గలవానిగా గ్రామప్రజలు వారిని గుర్తించిరి. అతని అందమైన తేజోరూపమునకు ముగ్ధులైరి.

ఆ పిన్నవయస్సులోనే ఆ బాలుడు శీతోష్ణములకు లెక్కచేయక, ఎవరితోను మాటాడక, దేనికి భయపడక, ఆహారమును కూడ కోరక, నిరంతరము తపమాచరించు బాలఫకీరుగా ఆ వేపచెట్టు క్రింద షిరిడీవాసులు ఆ బాలుని దర్శించుచుండిరి. కాలము గడుచుచున్నది. ఒక రోజున ఖండోబా దేవుడు ఆవేశించిన గణాచారి చెప్పిన ప్రకారము ఆ వేపచెట్టు క్రింద త్రవ్వించిరి. అందులో నాలుగు దీపములు దానిక్రింద భూగృహము, గోముఖ నిర్మాణము, కర్రబల్లలు, జపమాల కనుపించినవి. ఆ బాలుడు యిచట 12సంవత్సరములు తపస్సు చేసెనని గణాచారి చెప్పెను. ఆ బాలుడు కూడ అదియే తన గురుస్థానమునియు, ఎప్పటివలె దానిని మూతవేయించెను. మూడు సంవత్సరములు మాత్రము అచటనే యుండి తదుపరి ఎవరికి చెప్పకయే ఆ బాలుడు ఎచటికో వెళ్ళెను.

ఒక సంవత్సరము తరువాత అనగా 1858లో అహమద్‌నగర్ జిల్లా ధూప్ గ్రామము దగ్గర ఒక మామిడిచెట్టు క్రింద తలపైన టోపీతో, పొడవైన చొక్కా ధరించి, చంకలో సటకా పెట్టుకుని ఈ బాలుడు కూర్చుని యుండెను. అదే సమయమున గుఱ్ఱపు జీనును భుజమున ధరించి, తప్పిపోయిన తన గుఱ్ఱమును వెదకుచున్న చాంద్‌పాటీలు అను నతడు ఈ బాలుని చూచెను. తప్పిపోయి, ఎంతో దూరములోయున్న చాంద్‌పాటీలు గుఱ్ఱపుజాడను ఆ బాలుడు ఆ చెట్టు క్రింద కూర్చొనియే చాంద్‌పాటీలునకు తెలియజెప్పెను. ఎంత ఆశ్చర్యము. అంతియేకాదు. ఆ బాలుడు చాంద్ పాటీలు చూచు చుండగనే తన చేతిలో నున్న సటకాను ( ఇనుప చువ్వలాంటిది) భూమిపై కొట్టగా నీరు వచ్చినది. ఆ నీటితో గుడ్డను తడిపి చిలుము గొట్టములో పెట్టి, మఱలా ఆ సటకాను భూమిలోనికి గుచ్చగా నిప్పు వచ్చినది. ఆనిప్పుతో చిలుమును వెలిగించి తాను ఆ చిలుము త్రాగి, చాంద్‌పాటీలుకు కూడ త్రాగుటకుయిచ్చెను. సృష్టికి మూలమైన పంచభూతములను శాసించి, తనసంకల్ప మాత్రముననే భూమి నుండి నీరు -నిప్పును తెప్పించి, దూరముతో కూడ తనకు పనిలేదన్నట్లు

ఎంతో దూరములో నున్న గుఱ్ఱపు జాడను చెట్టుక్రింద కూర్చునియే చెప్పి తన లీలలను ప్రథమముగా ఆ బాలుడు ప్రకటించుట ఎంత అద్భుతలీల! ఈ లీలలను చూచిన చాంద్‌పాటీలు ఆ బాలుని గొప్ప జౌలియగా అనగా మహాత్ముడుగా గుర్తించి, వారిని ధూప్ గ్రామమునకు విచ్చేయవలసినదిగా ప్రార్థించెను.

చాంద్‌పాటీలు కోరినట్లుగా ఆ బాలుడు ధూప్‌గ్రామమునకు వచ్చెను. చాంద్‌పాటీలు బావమఱది కొడుకు పెండ్లి బృందముతో 1858 లో రెండవసారి ఆ బాలుడు షిరిడీ వచ్చెను. షిరిడీలో ఖండోబా ఆలయము ముందున్న మఱ్ఱిచెట్టు క్రింద ఆగిన ఆ పెండ్లిబండ్ల నుండి దిగిన ఆ బాలఫకీరును ఖండోబా మందిర పూజారియైన భక్తమహాల్సాపతి చూచి - చూడగనే ఆ బాలునిలోని భగవత్ తత్త్వమును గుర్తించి దయచేయుము సాయి (ఆయియే సాయి) అని స్వాగతము పలికెను. అప్పటివరకు ఏ పేరులేని ఈ బాలఫకీరును భక్తమహాల్సాపతి సాయి అనే నామముతో మొదటిసారిగా పిలిచెను. తద్వారా అందరు ఆ బాలఫకీరును సాయిబాబాగాను, షిరిడీలో స్థిరనివాస మేర్పరచుకొనుట వలన షిరిడీ సాయిబాబాగాను భక్తులు పిలవసాగిరి. నాటినుండి ఆ బాలుని సాయి అను నామముతో కీర్తించుచూ, పూజించి తరింపసాగిరి. సాయి అనే ఈరెండక్షరముల నామమే సాయిభక్తులకు భవసాగరమును దాటించు తారకమంత్రమైనది. ఆహా! ఏమి సాయిభక్తుల యదృష్టము.

అని పౌరాణికుండు భగవదవతారమగు సాయినాథుని ఆగమన విధానము నంతయు శ్రోతలకు ఎరిగించెను.

ఓం శ్రీసాయిరాం

ప్రథమోధ్యాయః సమాప్తః

గమనిక : వ్రతములో పాల్గొన్న దంపతులు మొదటలో తమ చేతిలో వుంచుకున్న అక్షతలను అధ్యాయము పూర్తికాగానే ఓం శ్రీసాయినాథాయ నమః అనుమంత్రమును 3 సార్లు కాని, 9 సార్లుకాని, 11సార్లు కాని చెప్పుచూ పూజచేసి, ధూపము, దీపము చూపి, సిద్ధము చేసియుంచిన రవ్వ, పంచదార కలిపిన ప్రసాదమును 5 భాగములుచేసి ఒక భాగమును (అరటిపండు ఉన్న తొక్కతీసి ఆప్రసాదముపై ఉంచవలెను.) నైవేద్యము పెట్టవలెను. నైవేద్య మంత్రమును చెప్పి చివరలో శ్రీసాయినాథాయ నమః అవసరార్థం గోధుమ చూర్ణశర్కర సహిత కదళీఫల అమృతోపహార నైవేద్యం సమర్పయామి అని చెప్పవలెను. తరువాత కర్పూరహారతి యివ్వవలెను.

తరువాతి అధ్యాయము ప్రారంభములో మరలా చేతిలోనికి అక్షతలు తీసికొని కథ వినవలెను. ఇట్లే ప్రతి అధ్యాయము చివర చేయవలెను. శ్రోతలుగా పాల్గొన్న భక్తులు 5అధ్యాయములు పూర్తి అగువరకు అక్షతలు వేయక తమ వద్దనే యుంచుకొనవలెను.

## రెండవ అధ్యాయము

## రెండవ అధ్యాయము ప్రారంభము

సదానింబవృక్షస్య మూలాధివాసాత్
సుధాస్రావిణం తిక్తమప్య ప్రియంతం
తరుంకల్పవృక్షాధికం సాధయంతం
నమామీశ్వరం సద్గురుం సాయినాథం ॥

సదా చేదురసమును స్రవించు వేపచెట్టు మూలములో నివసించి, దానిని కల్పవృక్షము కంటె అధికమ్మైన దానినిగా చేసిన, ఈశ్వరుడైన సద్గురు సాయినాథునకు నమస్కరించుచున్నాను.

పంచభూతములను శాసించిన శ్రీసాయిబాబా లీలలు ఇంకను వినవలయునని కుతూహలము కలుగుచున్నది. వానిని వినిపించవలసినదిగా శ్రోతలు ప్రార్థించగా వారి శ్రద్ధా - భక్తులను గమనించిన పౌరాణికుండిట్లు చెప్పదొడగెను.

శ్రీసాయిబాబా 1858లో రెండవసారి 20 సంవత్సరముల వయస్సులో షిరిడీవచ్చి 1918 లోవారు దేహత్యాగము వఱకు అరువది సంవత్సరములు షిరిడీ గ్రామములో భౌతిక దేహముతో యుండిరి. అందువలన వారి వయస్సు 80 సంవత్సరములుగా భక్తులు తలచిరి. బాబా మాత్రము తన వయస్సు లక్షల సంవత్సరములని ధూలియా కోర్టువారికి చెప్పెను. 16 సంవత్సరముల వయస్సుకే 12 సంవత్సరములు తపస్సు చేసినారని గణాచారి చెప్పియుండెనుగదా! కనుక సాయిబాబా వయస్సును ఎవరు నిర్ణయించలేకపోయినారు.

బాబా మొదటిసారి షిరిడీ వచ్చిన 16 సంవత్సరముల వయస్సుకు పూర్వము గల బాబా చరిత్ర ఎవరికి తెలియదు. బాబాకూడ ఎప్పుడు చెప్పియుండలేదు. అందువలననే బాబా పుట్టుక గుఱించికాని, వారి తల్లిదండ్రులగుఱించి కాని ఎవరికి తెలియదు. పుట్టుకయే తెలియని సాయినాథుని కులము - మతము కూడ తెలియనందున సాయిబాబా కులమతముల కతీతుడని, మానవత్వమే వారి మతమని, వారు స్వయం భువులని భక్తులు తలచిరి. బాబా ఆజన్మబ్రహ్మచారి.

బాబా తన అవతార ప్రకటనను బీదల - అనాథల మధ్యనుండియే ప్రారంభించెను. మనము అంటరానివారని తలచు కుష్టురోగులకు, స్వయముగా సేవచేసెడివారు. కుష్టువ్యాధి పీడితుడై ఆదరించువారు లేక బాధపడుచు పడియున్న బాగోజీ అనువానిని అక్కున చేర్చుకొని, సేవచేసి సేద తీర్చి ఆదరించుటయే కాక కుష్టువ్యాధితో చీము, నెత్తురు కారుచున్న బాగోజీ శరీరమును ఆపాదమస్తకము తన చేతితో నిమిరి అతని కుష్టువ్యాధిని పోగొట్టిరి.

బాబా షిరిడీలో మహ్మదీయులకు పవిత్రమైన పాడుపడిన మసీదులో నివసించెను. దానికి ద్వారకామాయి అని పేరిడెను. "ఇది ద్వారపతి. ఇందులో కాలుమోపినవారు ఆరోగ్యమును, ఆనందమును పొందెదర"ని బాబా చెప్పిరి. మసీదుకు ప్రక్కనే హిందువులకు పవిత్రమైన తులసీవనమునుకూడ పెంచెను. ఈ ద్వారకామాయిలో ఆగ్నేయ భాగమున నిరంతరము వెలుగుచుండెడి హోమగుండము గలదు. ఆ హోమగుండమునకు ధుని అని పేరు. దానిని బాబాయే వెలిగించెను. అప్పటినుండి ఇప్పటి వఱకు ఆ ధుని అహోరాత్రములు అట్లే వెలుగుచునే యున్నది. దీనిలోని భస్మము అనగా ఊదియే సాయిబాబా ప్రసాదము. బాబా ఈ ఊదిని భక్తులకు ప్రసాదము గాను, రోగములు తగ్గుటకు ఔషధముగాను, జ్ఞానమును పొందుటకు జ్ఞానశక్తిగాను ప్రసాదించేవారు. ఈ ఊది ద్వారా మానవ శరీరము అశాశ్వత మని ఎప్పటికైనా ఇట్లే బూదికాక మానదని మానవులకు గుర్తింపుకూడ చేసి జ్ఞానోదయమును బాబా కలిగించుచున్నారు. ఇప్పటికిని సాయిభక్తులు ఈ ఊది సకల కష్టనష్ట సంహారిణి యనియు, సర్వసుఖ సౌభాగ్యప్రదాయిని యనియు విశ్వసించి, ఈ ఊదిని నొసట పెట్టుకొని, నీటిలో కలిపి సేవించుచూ ఇహ-పర సుఖములను పొందుచున్నారు.

బాబా ద్వారకామాయిలో ఈశాన్య దిక్కున ఒక గోనెపట్టాపైన కూర్చుండెడివారు. పగటిపూట నిదురించేవారు కాదు. రాత్రింబవళ్ళు తన బిడ్డల సంరక్షణ వహించు సాయినాథునకు నిద్ర ఎక్కడ ?

అడిగినప్పుడే సమాధానము చెప్పెడివారు. సాయిబాబా అందముగా బంగారు రంగులోనుండి మెఱయు చుండెడివారు. వారి కళ్లు చీకటిలో మెఱిసెడివి. వారి నవ్వు మందహాసముగా మనోహరముగా ఉండేది. 5-6 ఎత్తు ఉండేవారు. మనము ఒక్కసారి కన్నులు మూసుకొని మన హృదయములో వారి రూపమును నిలుపుకొందుము గాక.

సమర్థ సద్గురుసాయినాథ్ మహారాజ్‌కి జై

బాబావద్ద 1) చిలుముగొట్టము 2) పొగాకు 3) తంబిరేకుల డొక్కు (రేకు డబ్బా) 4) పొడవు చొక్కా 5) తలగుడ్డ 6) సటకా మాత్రము ఉండెడివి. ఇదియే వారి ఆస్తి. బాబా ప్రతిరోజు మధ్యాహ్నము గ్రామములో భిక్ష చేసెడివారు. అమీన్‌భాయి అనెడి మహ్మదీయభక్తుడు బాబాకు మొదటిసారిగా భిక్ష పెట్టెను. బాబా ప్రతిరోజు ఐదు యిండ్లవద్ద మాత్రమే భిక్ష చేసేవారు. ప్రతి యింటియొద్దకు వెళ్ళి అక్కా రొట్టెముక్క పెట్టు అని అడిగేవారు. రుచులకాశించి ఎఱుగరు. ఆ భిక్షలో వచ్చిన పదార్థము లన్నింటిని ద్వారకామాయిలో యున్న మట్టిపాత్ర కొళంబె లోపోసెడివారు. కాకులు, పిల్లులు, కుక్కలు తినుచుండగానే వానిని తోలక వానితోపాటు బాబాకూడ కలిసి తినేవారు. బాబా ఈ భిక్షద్వారా అన్ని దానములలో అన్నదానము శ్రేష్టమని, గృహస్థులైన వారు తాముచేయు నిత్యకర్మలలో కలుగు పాపములు ఈ అన్నదానము చేయుట ద్వారా పోవునని మనకు తెలియచెప్పిరి.

ఆకలిగొన్నవారికి అన్నము పెట్టినను, దాహముగలవారికి నీరిచ్చినను, గుడ్డలు లేనివారికి వస్త్రములు ఇచ్చినను, ఇండ్లులేనివారికి కూర్చుండుటకు వసారా యిచ్చినను భగవంతుడు మేలుచేయునని బాబా భక్తులకు చెప్పియున్నారు. 1910 వఱకు బాబా తామేస్వయముగా పదార్థములను సేకరించి ద్వారకామాయి ముందుగల ఖాళీస్థలములో పొయ్యిపెట్టి డేగిసాలతో (గుండిగలలాంటివి) పదార్థములను వండి బీదలకు స్వయముగా బాబాయే పెట్టెడివారు. పొయ్యిపై సెగలతో సలసలా ఉడుకుచున్న పదార్థములు ఉడికినది లేనిది తెలుసుకొనుటకు బాబా తన చేతిని తెడ్డువలె ఆ డేగిసాలలో పెట్టి కలియబెట్టుచు చూచెడివారు. ఆ ఉడుకుచున్న డేగిసాలో చేయి పెట్టినా వారి చేయి కాలెడిదికాదు. ఎప్పటివలె మామూలుగనే యుండెడిది. ఇది ఎంతటి మహిమ!

బాబాను దర్శించుటకు అన్ని మతములవారు వచ్చెడివారు. ఈ మసీదులోనే గంధకుసుమాద్యలంకారములతో హిందువులు వారి ఆచార ప్రకారము బాబాను పూజించెడివారు. ఆ విధముగనే మహ్మదీయులు తమ మతాచార ప్రకారము బాబాను ఆరాధించేవారు. ఇదియే సాయిబాబాలో మనము చూచెడి ప్రత్యేకత. ఆరాధించు పద్ధతులు వేరైనను, మతాచారములు భేదించినను, వాటిని అందుకొని అనుగ్రహించునది ఒక్కరేనని ఆ మూర్తి యందు భేదమేమియు లేదని ప్రత్యక్ష ప్రమాణములతో సంశయములు తీరునట్లు బాబా నిర్దిష్టముగా నిరూపించినారు. శ్రీరామనవమి రోజున పగలు హిందువులకు పవిత్రమైన రామనవమి ఉత్సవము, అదేరోజు రాత్రి మహ్మదీయులకు పవిత్రమైన చందనోత్సవమును ఈ మసీదులోనే ఒకేరోజు జరిపించి రాం-రహీమ్ ఏక్‌హై అని హిందూ మహమ్మదీయ మతములకు సమైక్యతను చెప్పకయే ఆచరణ ద్వారా నిరూపించిరి. ఈ రెండు మతముల వారు కలసిమెలసి యిందులో పాల్గొనెడివారు.

బ్రిటీష్ ప్రభుత్వము వారు సాయిబాబాపై నిఘా ఏర్పరచి క్రైస్తవుడైన చక్రనారాయణ అను పోలీస్ కానిస్టేబులును నియమించినారు. ఈ విషయం బాబాతో చెపితే అతడే నేను. అతడు నా సోదరుడు అని బాబా చెప్పారు. మతాతీతమైన మానవతావాది బాబా.

సాయిబాబాకు దీపములను వెలిగించుట యన్న చాలా యిష్టము. ప్రతిరోజు ఊరిలోని దుకాణదారులనుండి నూనెను తీసికొని వచ్చి మసీదు నందంతటను ప్రమిదలు పేర్చి వత్తులు పెట్టి ఆ తెచ్చిన నూనెను పోసి దీపములు వెలిగించెడివారు. ఇట్లు ప్రతిదినము జరుగుచుండగా ఒకరోజున వ్యాపారస్తులందరు నూనె ఈయరాదని తీర్మానించుకొని నూనెలేదని బాబాతో చెప్పిరి. బాబా చిరునవ్వుతో ఖాళీడబ్బాతో మసీదుకు తిరిగివచ్చినారు. వ్యాపారస్తులు కూడా బాబా దీపము లెట్లు వెలిగించునో చూడదలచి మసీదు దగ్గరకు వచ్చినారు. బాబా ప్రమిదలన్నిటి యందు వత్తులు పెట్టి మసీదులో ఎప్పటివలె నుంచిరి. తంబిరేకుల డొక్కులో రెండు మూడు నూనె చుక్కలు మాత్రమే యున్నవి. బాబా ఆ రేకు డొక్కులో నీటిని పోసి ఆ నీటిని త్రాగి మరల ఆ నీటిని ఆ రేకు డొక్కులో ఉమిసిరి. ఉమిసిన ఆ నీటిని ప్రమిదలలో నింపి బాబా దీపములు వెలిగించిరి. తెల్లవారు వఱకు ఆ దీపములు అట్లే వెలిగినవి. ఇదియంతయు కన్నులారా చూచుచున్న దుకాణాదారులు, బాబా కేవలము పిచ్చి ఫకీరు కాదని సాక్షాత్ పరమాత్మయేనని విశ్వసించి పరుగు పరుగున వచ్చి బాబా పాదములపైబడి తమ అపరాధమును మన్నించ వలసినదిగా ప్రార్థించిరి. బాబా ఆ వ్యాపారులకు ఈ లీలద్వారా జ్ఞానోదయము కలిగించి వారిని క్షమించి సత్ప్రవర్తనతో ప్రవర్తింపుడని బోధించెను.

ఓం శ్రీసాయిరాం

ద్వితీయోధ్యాయః సమాప్తః

ప్రథమాధ్యాయము చివర చేసినట్లుగా పూజ, ధూప, దీప, నైవేద్యము, హారతి యిచ్చి మరల అక్షతలు చేతిలోనికి తీసుకొనవలెను.

## మూడవ అధ్యాయం

నిత్యంబునిష్ఠతో నీ పాదపద్మంబు
పూజించుచుండెడి పూజ్యులకును
నిర్మలభక్తితో నీనామకీర్తనల్
పఠనమొనర్చెడి పావనులకు
నీచరిత్రము విని నిన్ను స్తుతించెడి
పాదాబ్జదాసులౌ భక్తులకును
నీ మంగళాకృతి నిరతంబు భావించి
సంతసంబందెడి సజ్జనులకు
ఆయురారోగ్య సంపదలతిశయించి
విశ్వసౌఖ్యంబు నిత్యంబు వెలయుగాదె
నీదు మహిమంబు నెంచంగ నెవరితరము
సాధు సద్గుణ గుణగణ్యసాయిబాబ

బాబా సముఖములో నాలుగు వేళలలో హారతులు ఇచ్చెడివారు. ఆ సమయములో బాబా ప్రశాంతముగా కూర్చుండెడివారు. భక్తులు అప్పుడేకాక ఇప్పుడును ఈ హారతులలో పాల్గొనుటకు అత్యంత భక్తిశ్రద్ధలు ఉత్సాహమును చూపుదురు. సాయిభక్తులు బ్రాహ్మీ ముహూర్తముననే సాయిస్మరణతో లేచి ఉదయం గం. 5-15 ని.లకు కాకడహారతిలో పాల్గొని దైనందిన జీవితము గడుపుచూ, రాత్రి 10-00 లకు శేజహారతిలో పాల్గొని బాబా స్మరణతో నిద్రించెదరు. బాబాకు సర్వస్య శరణాగతి అయిన భక్తులకు ఎల్లప్పుడు ఈవిధముగా సాయిస్మరణలో ఉండుట కన్నా ఏమికావాలి ?

బాబా పరుండుటకు నానాసాహెబుడేంగ్‌లే నాలుగు మూరల పొడవు, జానెడు వెడల్పుగల చెక్కబల్లను ఇచ్చియున్నాడు. దానిని చింకిగుడ్డ పేలికలతో మసీదు వెన్నుపట్టికి వ్రేలాడదీసి ఆ బల్లపై నాలుగు మూలల యందును ప్రమిదలతో దీపములు పెట్టెడివారు. ఆజానుబాహువైన బాబా, భక్తులకు క్రింద కనుపించుచునే అంత ఎత్తున గల బల్లపైకి ఎట్లు ఎక్కెడివారో, చాలీ చాలని ఆ కొద్దిబల్లపై ఎట్లు పరుండెడివారో మఱియు గుడ్డపేలికలతో కట్టిన ఆ బల్ల ఎట్లు నిలిచియుండెనో తెలియక భక్తులు ఆశ్చర్యచకితులై వింతగా చూచుచుండగా బాబా విసుగుచెంది ఆ బల్లను ఒకరోజు విఱచి వేసెను.

ఒక పుట్టు గ్రుడ్డివాడు బాబాను శరణువేడగా భయపడకుమని అభయమిచ్చి తన చేతితో లొట్టలు పడియున్న అతని కండ్లను తుడిచి దృష్టిని ప్రసాదించెను. నడువలేని ఒక బాలుని కాళ్ళను తన చేతితో సవరించగనే అతని కుంటితనము పోయి మామూలు మానవునిగా చకచక నడువసాగెను.

అమరావతి పట్టణమున ప్రసిద్ధిచెందిన న్యాయవాది గలడు. అతని పేరు దాదా సాహెబ్‌కపర్డే. ఆ కుటుంబములోని వారందఱు సాయినాధుని భక్తులు.కపర్డే భార్య తన చిన్న కుమారుని తీసికొని షిరిడీ వచ్చి కొన్ని రోజులు సాయిబాబా సన్నిధిలో ఉన్నది. ఒకరోజు ఉదయం ఆ బాలుడు ఒడలు తెలియని జ్వరముతో బాధపడుచుండెను. అతని శరీరముపై బొబ్బలు కనుపించగా అది ప్లేగువ్యాధి అని కపర్డే భార్య భయపడి బాబావద్దకు వచ్చి తన తనయుని అమరావతి తీసికొని వెళ్ళుటకు అనుమతినీయవలసినదిగా ప్రార్థించినది. నేను ఇచట నుండగా భయపడెదవేల అని అప్యాయముగా పలికి, తన కఫ్నీని పైకి ఎత్తి, చంకలోగల కోడిగ్రుడ్లంత పెద్దవి నాలుగు ప్లేగు బొబ్బలను ఆమెకును, అచటనున్న వారందఱికి బాబాచూపెను. అంతట ఆ బాలుని ప్లేగువ్యాధి వెంటనే తగ్గెను. అప్పుడు బాబా చూచితిరా! నా భక్తుని కొఱకు నేనెట్లు బాధపడితినో ? నా భక్తుల కష్టములన్నియు నావిగనే భావించెదను అని చెప్పెను. తన పుత్రుని వ్యాధిని బాబా స్వీకరించి తన బిడ్డకు ప్రాణదాన మొసంగిన సాయిబాబాకు కృతజ్ఞత తెలియచేసి బాబా నామమును ఆమె ఆజన్మాంతము జపించసాగెను.

ఒకసరి శ్యామా మరదలుకు ప్లేగు వ్యాధి సోకగా శ్యామా బాబాతో ఆమెను కాపాడమని విన్నవించుకొనెను. యీసారి బాబా ఆమె ప్లేగు బొబ్బలు స్వీకరించలేదు. బాబా శ్యామా తమ్ముని ద్వారా యిచ్చి పంపిన ఊదిని ఆమె స్వీకరించుట ద్వారా ఆ వ్యాధిని వెంటనే తగ్గించిరి. బాబా అనుగ్రహించు విధాన మెవరికెఱుక ? ఇట్లే మరియొక భక్తుని బిడ్డను బాబా యెట్లు కాపాడిరో వినుడు. క్రీ.శ.॥ 1910 వ సం॥లో దీపావళి రోజున బాబా మసీదులో ధుని ముందు కూర్చొని కట్టెలు సవరించుచుండగా భక్తులు బాబా వద్ద కూర్చొని వారుచెప్పు లీలలు వినుచుండిరి. ఉన్నట్లుండి బాబా ఆ కట్టెలకు బదులుగా తన చేతిని ఆ మండుచున్న ధునిలోనికి పెట్టిరి. అచటనే యున్న మాధవుడను నౌకరు మఱియు మాధవరావు దేశపాండే అను భక్తుడు ఇది చూచి ఆ కాలుచున్న బాబా చేతిని

ధుని నుండి బయటకు లాగిరి. ధునిలో చెయ్యి ఎందుకు పెట్టినారు? అని బాబాను అడిగిరి. దూరదేశమున నాభక్తులైన కమ్మరి కుటుంబమున్నది. కమ్మరి జ్వరపీడితు డగుటచే అతని భార్య తన చంటి బిడ్డడిని ఒడిలో నుంచుకొని కొలిమి తిత్తులు వేయుచున్నది. జ్వరపీడతో బాధపడుచున్న కమ్మరి తన భార్యను పిలువగనే ఆమె తన ఒడిలో నున్న బిడ్డసంగతిని మఱచి ఆత్రముతో లేచినది. ఆ పిల్లవాడు తల్లి ఒడినుండి భగభగమని మండుచున్న కొలిమిలో పడెను. ఆ బాలుడును క్రితం జన్మలో నా భక్తుడే. అందువలన వెంటనే యిచట ధునిలో నా చేతిని పెట్టి అచట కొలిమిలో పడిన బిడ్డను పైకి తీసి కాపాడితిని. అదియే నాకానందము కలిగించినది. అని బాబా వారికి చెప్పెను. రెండు రోజులకు ఆ కమ్మరి దంపతులు ద్వారకామాయికి వచ్చి బాబా పాదములపై పడి తన బిడ్డను రక్షించినందుకు బాబాకు తమ కృతజ్ఞత తెలుపుకొనినారు. కన్నతల్లియైనను ఆ కమ్మరిభార్య తన బిడ్డను మరచి ప్రమాదమునకు గురిచేసినది కాని తన భక్తుల భారమును వహించు సాయి ప్రభువు తాను షిరిడీలోనే యుండి తనచేతిని చాపి ఈ బిడ్డను కాపాడి అందరు తన బిడ్డలే అని నిరూపించిరి. వారికి సాధ్యము కానిదేమియు లేదు. వారికి దూరముతో కాని కాలముతో కాని పని లేదు కదా!

బాబా దివ్యలీలలు కోకొల్లలు కలవు. భక్తులు మనస్ఫూర్తిగా బాబాకు అంకితమైనచో వారి భారమంతయు బాబా వహించగలరన్నది ఈ లీలల ద్వారా మనము గ్రహించగలము. బాబా భక్తులను అనుగ్రహించు విధానమే ప్రత్యేకమని, నభూతో నభవిష్యతి అని గ్రహించుటచే బాబాను దర్శించు భక్తుల సంఖ్య పెరగసాగినది.

జయామనీ జైసాభావ । తయాతైసా అనుభవ

దావిసిదయాఘనా । ఐసితురీఘిహిమావ ॥

మీరు (బాబా) ఎవరి భావమెలా యుంటే వారి కలా అనుభవ మిస్తారు. దయాఘనా ఇదే మీ విధానము.

సాయిబాబా ఏ ఒక్క దేవతామూర్తికి ప్రతినిధికారు. అన్ని దేవతా స్వరూపములు తానై యున్నారు. ఏ ఏ దేవతలు ఏ ఏ కోర్కెలు తీర్చుచున్నారో ఆయా దేవతలు ఇచ్చు అన్ని కోర్కెలు తానొక్కరే తీర్చుచున్న పరబ్రహ్మ స్వరూపమే సాయిబాబా.

సాయిబాబా సద్గురువులకు సామ్రాట్ అని మెహర్‌బాబా చెప్పి యున్నారు. భక్తులకు తమ ఆరాధ్యదైవమైన దత్తాత్రేయునిగా, శ్రీరామునిగా, విఠలునిగా, గణపతిగా దర్శనములు ఇచ్చియున్నారు. ఇతర గురు రూపములుగా కూడ దర్శనమిచ్చియున్నారు. అని పౌరాణికుండు చెప్పుచుండగా బాబా కథలు వినుటవలన కలుగు ఫలితము లేమి ? ఈ సాయి సత్యవ్రతములు చేయుట ఎవరు ఎప్పుడు ప్రారంభించారో సవిస్తరముగా వివరించవలసినదిగా శ్రోతలు కోరగా వారి బుద్ధి కుశలతకు ఆనందించిన వాడై పౌరాణికుండు ఇట్లు వివరించసాగెను.

హేమాడ్‌పంతు అను భక్తుడు బాబా చరిత్రవ్రాయుటకు కోరినప్పుడు, బాబా శ్యామాతో హేమాడ్‌పంతు నిమిత్త మాత్రుడే. ముఖ్య విషయములు టూకీగా వ్రాయమనుము. నా జీవిత చరిత్రను నేనే వ్రాసుకొని నాభక్తుల కోరికలు నెరవేర్చెదను. నేను వాని మనస్సులో ప్రవేశించి, నా చరిత్రను నేనే వ్రాసుకొందును. నా కథలు, బోధలు విన్న భక్తులకు భక్తి - విశ్వాసములు కుదురును. వారు ఆత్మసాక్షాత్కారము పొందెదరని చెప్పెను. నా లీలలు శ్రద్ధా భక్తులతో ఎవరు వినెదరో వారికి ప్రపంచమందు మమత క్షీణించును. జ్ఞాన రత్నములు లభించును. నా కథలు వినినచో సర్వరోగములు నివృ, మించును అని కూడ బాబా చెప్పెను. బాబా చెప్పినట్లుగా బాబా కథలు వినుటవలన ఈతి బాధలు తొలగుచున్నవి. కోర్కెలు నెఱవేరుచున్నవి.

సుఖ-శాంతులు కలుగుచున్నవి. ఇప్పుడును బాబా కథలు చదివిన, విన్న భక్తులకు జరుగు ప్రత్యక్ష నిదర్శనములు ఎన్నియో కలవు. ఇంకను సంశయాత్ములమైనచో దిక్కులేని వారమగుదుము.

1909లో భీమాజీపాటిలు అను నతడు క్షయవ్యాధితో బాధపడుచు, ఎన్ని ఔషధములు సేవించినను ఆ వ్యాధి తగ్గలేదు. అప్పుడు నానాసాహెబ్ చాందోర్కర్ సలహాపై షిరిడీ వెళ్ళి బాబా పాదములపైబడి "బాబా" ఈ వ్యాధినుండి నన్ను కాపాడుము. మీరు తప్ప నన్ను రక్షించువారు లేరు అని అతిదీనముగా ప్రార్థించెను. దయాళుడైన బాబా హృదయము కరిగి "ఆగుము. నీ ఆతురత పారద్రోలుము. నీ కష్టములు గట్టెక్కగలవు. ఎంత బాధ అనుభవించువారైనను ఈ మసీదు మెట్లెక్కినంతనే వారి బాధలన్నియు తొలగిపోగలవు" అని అతనితో చెప్పెను.

భీమాజీకి మొదట స్వప్నములో భీమాజీ పాఠశాల విద్యార్థిగా కంఠస్థపద్యము అప్పగించకపోవుటచే ఉపాధ్యాయుడు దెబ్బలు కొట్టినట్లుగా చూపెను. రెండవ స్వప్నములో భీమాజీ ఛాతిపై పెద్దబండను పడవైచి దానిని క్రిందకు - మీదకు త్రిప్పుచున్నట్లు చేయుటచే బాధ కలుగునట్లు చూపెను. ఈరెండు స్వప్నముల వలన వాని బాధలు పూర్తిగా తగ్గెను.

భీమాజీ ఆరోగ్యవంతుడై తన స్వగ్రామమైన జిన్నూరు తాలూకాలోని నారాయణగాం వెళ్ళి దాసగణు మహారాజ్ మరాఠీలో వ్రాసిన సాయి సత్యవ్రత కథలతో 1909 వ సం॥లో బాబాదేహధారిగా ఉండగనే తనకు ప్రాణ దానము చేసిన బాబాయందు కృతజ్ఞుడై ప్రథమముగా ఈ సాయి సత్యవ్రతము లను చేయుట ప్రారంభించెను. నియమానుసారముగా ఈ సాయి సత్య వ్రతములను చేయుచూ సర్వసుఖములను అనుభవించుచూ భీమాజీ పాటిలు అంత్యమున సాయినాథుని సాయుజ్యమును పొందెను. అప్పటినుండి ఈ సాయి సత్యవ్రతములను భక్తులు చేయనారంభించిరని పౌరాణికుండు వివరించిరి.

ఓం శ్రీసాయిరాం

తృతీయోధ్యాయః సమాప్తః

క్రితం అధ్యాయము చివర చేసినట్లుగా పూజ, ధూప, దీప, నైవేద్యము, హారతి యిచ్చి మరల అక్షతలు చేతిలోనికి తీసికొనవలెను.

## నాల్గవ అధ్యాయము

### నాల్గవ అధ్యాయము ప్రారంభము

శ్రీసాయినాథ చరణామృత పూతచిత్తాః।
తత్పాద సేవనరతా సతతంచ భక్త్యా।
సంసార జన్య దురితౌఘ వినిర్గ తాస్తే।
కైవల్యధామ పరమం సమవాప్నువంతి ॥

తాత్పర్యము ॥ శ్రీ సాయినాథుని పాదములయందు పూర్ణమైన మనస్సు నుంచి, ఆ పాదసేవ ఎల్లప్పుడు చేయు భక్తులుసంసారజన్మ - కర్మసంబంధమైన దురితముల నుంచి విముక్తులై కైవల్యమును పొందెదరు.

1905 సంవత్సరములో నానాసాహెబ్ చాందోర్కరు ఖాందెష్ జిల్లాలోని జామ్నేరులో మమలతదారుగా నున్నారు. వీరు సాయినాథుని పూర్తి అనుగ్రహము పొందిన భక్తులు. వారికుమార్తె మైనతాయి గర్భవతి. ఆమె రెండు మూడు దినముల నుండి ప్రసవవేదన పడుచున్నది. వైద్యులు ఎన్నియో ఔషధములు వాడిరి.

అయినను సుఖప్రసవము జరుగు అవకాశములు కనుపించలేదు. ఇట్టి కష్టకాలములో నానాసాహెబ్ చాందోర్కరుకు సాయిబాబా జ్ఞప్తికి రాగా బాబా! ఈ ఆపదనుండి నా బిడ్డను నీవు తప్ప కాపాడు వారెవరు? ఆమె సుఖముగా ప్రసవముగునట్లు అనుగ్రహించుమని బాబాను ప్రార్థించెను. షిరిడీ నుండి తెచ్చిన ఊది కొఱకు యింటిలో వెదికెను. కాని ఊది యంతయు అయిపోయెను. సర్వకష్టములు తీర్చు ఊది ఇంటిలో లేకపోవుట వలన తన దురదృష్టమునకు చింతించసాగెను.

అప్పటివరకు షిరిడీలో ద్వారకామాయిలో కూర్చొని జామ్నేరులో నానాసాహెబ్ పడు అవస్థను గమనించుచున్న బాబా, నానా ఎప్పుడైతే తన కుమార్తె సుఖప్రసవమునకు జామ్నేరులో సాయిని ప్రార్థించెనో, అప్పుడే వారి రక్షణ కార్యక్రమమును బాబా షిరిడీలో ప్రారంభించెను. ఖాందేష్ వాస్తవ్యుడైన రాంగిరిబువా షిరిడివచ్చియుండెను. ఆ సమయమున తన గ్రామమునకు వెళ్ళుటకు సిద్ధముగా యుండెను. యితనిని బాబాయొక్కరే బాపుగిరిబువా అని పిలిచెడివారు. రాంగిరిబువాకు హారతిపాటను, ఊదిని ఇచ్చి తన గ్రామము వెళ్ళుదారిలో గల జామ్నేరు వెళ్ళుటకు సరిపోవు ధనము లేదని బాబాతో చెప్పెను. నీవు కలత చెందవద్దని బాబా అతనిని ప్రయాణము చేయించెను. రాంగిరిబువా రైలులో జలగాం చేరినాడు. రైలు దిగినాడు. అతని చేతిలో రెండు అణాలు మాత్రమేయున్నవి. ఈ అర్ధరాత్రి పూట జలగాం నుండి 30 మైళ్ళ దూరములో గల జామ్నేరుచేరుట ఎట్లు ? బాబా నీవే దిక్కయ్యా అని చింతించుచూ స్టేషనుబైటను వచ్చి బయట నిలబడెను.

ఇట్టి స్థితిలో బాపుగిరిబువా ఎవరు ? అని ఎవరో కేకవైచిరి. అది వినగనే నేనే అని రాంగిరి బువా చెప్పెను. నానాసాహెబ్ చాందోర్కర్ బండి పంపినారని చెప్పి అతను రాంగిరిబువాను రెండు గుఱ్ఱములు కట్టబడియున్న ఒక టాంగా వద్దకు తీసికొని వెళ్ళెను. టాంగాను చూడగనే రాంగిరిబువాకు ప్రాణములు లేచివచ్చినవి. ఇద్దరును ఆ టాంగాలో కూర్చుండగనే టాంగా వేగముగా బయలుదేరెను. మార్గమధ్యములో బంట్రోతు యిచ్చిన ఫలహారమును రాంగిరిబువా స్వీకరించెను. తెల్లవారు సరికి జామ్నేరు చేరిరి. రాంగిరిబువా ఒంటికి పోసుకొనుటకు టాంగా దిగి రెండు నిముషములలో తిరిగివచ్చునప్పటికి టాంగా కాని టాంగా తోలువాడు కాని బంట్రోతు కాని అచటలేరు గ్రామము వద్దకు వచ్చుటచే బండి వెళ్ళియుండ వచ్చునని తలచి రాంగిరిబువా గ్రామములోనికి వచ్చి నానాసాహెబ్ చాందోర్కర్ గారి యిల్లు తెలుసుకొని వారి ఇంటికి వెళ్ళెను. నానాసాహెబ్‌తో తాను షిరిడీ నుండి వస్తున్నట్లు చెప్పి, బాబా పంపిన ఆరతిపాట, ఊది నానాసాహెబ్‌కు ఇచ్చెను.

నానాసాహెబ్ చాందోర్కర్ ఆనందముతో బాబా పంపిన ఆరతిపాట, ఊది భార్యకు ఇవ్వగా ఆమె హారతి పాడి, ఊదిని నీళ్ళలో కలిపి కుమార్తెకు ఇవ్వగనే మైనతాయికి సుఖప్రసవమైనది. "బాబా! ఎంత దయామయుడ వయ్యా : సమయమునకు ఊది పంపి నా బిడ్డ ప్రాణములను కాపాడినావు. నిన్ను పొగడనాకు శక్యమా తండ్రి" అని బాబా సమయమునకు ఊది పంపి గండము నుండి రక్షించినందుకు రాంగిరిబువాకు కృతజ్ఞత తెలుపు కొనగా, సమయమునకు టాంగా పంపినందుకు రాంగిరి బువా నానాసాహెబ్ చాందోర్కరుకు కృతజ్ఞత తెలిపెను. ఇది వినిన నానాసాహెబ్ ఆశ్చర్యపడి తాను బండి పంపలేదని, మీరు వస్తున్నట్లు తనకు తెలియదని రాంగిరిబువాతో అనెను. ఇది విని ఆశ్చర్యపడుట రాంగిరిబువా వంతైనది. తాను జలగాం స్టేషను వెలుపల నుంచొని యుండగా "బాపుగిరి బువా ఎవరు ?" అని పిలుచుట గుర్తుకు తెచ్చుకొని, అట్లు పిలుచువారు బాబా ఒక్కరేకదా : అని తలచి, ఈ లీలయంతయు బాబాదేనని గ్రహించి "స్వామీ ! మీరులేని తావెక్కడ, అంతటా నేనే

నిండియున్నానని, అన్ని రూపములు నావేయని నా కండ్లు తెరిపించినావా బాబా !" అనుచు తన కండ్లు చెమ్మగిల్లగా రాంగిరి బువా ఆనందపరవశుడయ్యెను.

శ్రోతలారా! బాబా యొక్క ఈ లీలలో జలగాంలో బంట్రోతుగా, బండి నడుపు బండివానిగా, బండినిలాగు గుఱ్ఱములుగా, చివరకు ప్రాణములేని బండిగా కూడ యిన్ని రూపములు తానై తన సర్వవ్యాపకత్వమును తెలియజేసినారు సాయినాథుడు. అంతా మనమే చేసుకొనగలమను అహంకారముతో నుండి ఎప్పుడైతే మనకు శక్యముకాదని నిర్ణయము అయిన తరువాతనే, సాయిబాబాను ప్రార్థిస్తున్నాము. మనము నిమిత్తమాత్రులమని గుర్తించి, మొదటనే సాయినాథుని అర్థించిన ఇన్ని కష్టములు పొందము గదా !

నాందేడు పట్టణములో రతన్‌జీషాపుర్జీవాడియా అను పార్సీ భక్తుడు ఉండెను. అతడు మిక్కిలి ధనవంతుడు. ఔదార్యము గలవాడు. దాన ధర్మములు చేయువాడు. పైకి అతడు ఎంతయో సంతోషముగా ఉన్నట్లు అగుపించు చుండినను సంతానము లేకపోవుటచే మనోవ్యాకులతతో చింతాక్రాంతుడై యుండెడివాడు. వయస్సు మళ్ళుచున్నది.

ఒకసారి దాసగణు మహారాజును కలిసి తన మనస్సులోని బాధను చెప్పుకొనెను. రతన్‌జీ దీనావస్థను గమనించిన దాసగణు నీవు ఇట్లు చింతించనవసరము లేదు. భక్తుల పాలిటి కల్పవృక్షమైన సాయిబాబా షిరిడీలో ఉన్నారు. నీవు షిరిడీ వెళ్ళి విశ్వాసముతో సాయిబాబా పాదముల నాశ్రయించుము. నీ కోర్కె తప్పక తీరగలదని చెప్పెను.

రతన్‌జీ షిరిడీ వెళ్ళి బాబా పాదముల నాశ్రయించెను. తనకు సంతాన ప్రాప్తిని కలిగించమని ప్రార్థించెను. చీకాకుపడకు, నీ కీడురోజులు ముగిసినవి. అల్లా నీ మస్సులోని కోర్కెలు నెరవేర్చును అని బాబా అతనిని దీవించెను. బాబా ఆశీర్వాదముతో రతన్‌జీ దంపతులకు సంతానప్రాప్తి కలిగినది. వారు కృతజ్ఞతతో సాయినాథుని తలచుచూ తమ జీవితమును ధన్యత చేసుకొనిరి.

బాంద్రా నివాసియగు బాబా తెండూల్కర్ అనే విద్యార్థి వైద్య పరీక్షకు కూర్చుండుటకు బాగా కష్టపడి చదువుచుండెను. కాని అతనికి గ్రహములు సరిలేవని పరీక్షలలో కృతార్థుడు కాలేడని జ్యోతిష్కులు చెప్పుచుండిరి. బాబా తెండూల్కర్ తల్లి సావిత్రీబాయి తెండూల్కర్ షిరిడీ వెళ్ళి బాబాను దర్శించి యీ విషయమంతయు బాబాతో చెప్పుకొనెను. అప్పుడు బాబా ఆమెతో "నాయందు నమ్మకముంచి జాతకములు, వాని ఫలితములు, సాముద్రిక శాస్త్రజ్ఞుల పలుకులు ఒక ప్రక్కకు త్రోసి, తన పాఠములను చదువుకొనుమని చెప్పుము. శాంతమనస్సుతో పరీక్షలకువెళ్ళమనుము. అతడు ఈ సంవత్సరము తప్పక ఉత్తీర్ణుడగును. నాయందే నమ్మకము నుంచుమనుము" అని చెప్పెను. ఆమె తిరిగి బాంద్రా వచ్చి కుమారునితో బాబా చెప్పిన విషయమంతయు చెప్పినది. పరీక్షలు వ్రాసినాడు, కాని పరీక్షలో ప్యాసగు మార్కులు వచ్చునట్లు వ్రాయలేదని తలచినాడు. అందువలన తప్పుట ఖాయమని తలచి బాబా తెండూల్కర్ మౌఖిక పరీక్షకు హాజరు కాలేదు. వ్రాత పరీక్షలో కృతార్థుడవైనావు కనుక మౌఖిక పరీక్షకు రమ్మని పరీక్షాధికారి బాబా తెండూల్కరుకు కబురు పంపినాడు. బాబా తెండూల్కర్ మౌఖిక పరీక్షకు హాజరై అందులో కూడ కృతార్థుడైనాడు.

కనుక ఈ లీల వలన బాబాయందు నమ్మకము ఉంచుటయే ఫలితమునకు ముఖ్యమని, జాతకములు ఏమియు చేయలేవని తెలియవలెను. బాబా వాక్కు వేదవాక్కు. దానికి తిరుగులేదు. విశ్వసించుటయే మనవంతు.

ఓం శ్రీ సాయిరాం చతుర్థోధ్యాయః సమాప్తః
క్రితం అధ్యాయము చివర చేసినట్లుగా పూజ, ధూప, దీప, నైవేద్యము, హారతి యిచ్చి మరలా అక్షతలు చేతిలోనికి తీసికొనవలెను.

## ఐదవ అధ్యాయము

## ఐదవ అధ్యాయము ప్రారంభము

సాకారుండవో । లేక ని
రాకారుండవో । మఱేమి యగుదువో యెఱుగన్
నాకగునే - శ్రితుడ జడుండ
సాకవె । నీకరుణఁబఱపి సాయీనాథా :

శ్రోతలారా ! సాయిబాబాయందు మీకు ఏర్పడిన విశ్వాసమునకు, నాకెంతో ఆనందము కలిగించినది. ఏకాగ్రతతో ఆలకించవలసినదిగా పౌరాణికుండు ఇట్లు చెప్పసాగిరి.

శ్రీ సాయిబాబాకు సంతుష్టిగా భోజనము పెట్టుట ఎట్లో తెలుసు కుందాము. ఒకప్పుడు ఆత్మారాముని భార్య బాబాను దర్శించుటకు షిరిడీ వచ్చి ఒకరి యింటియందు బస చేసినది. ఒక రోజున ఆమెకూడ ఆ యింటివారితో కలసి భుజించుటకు కూర్చున్నది. వడ్డన పూర్తియైనది. ఆ సమయములో ఒక కుక్క యచటకు వచ్చి వాకిలి యొద్ద నిలిచి మొఱగుట ప్రారంభించినది. ఆత్మారాముని భార్యలేచి, ఒక రొట్టెను ఆ కుక్కకు వేసి వచ్చి అందరితో కలిసి భుజించినది. ఆ సాయంత్రము ఆత్మారాముని భార్య మసీదుకు పోగా, ఆమెతో బాబా యిట్లనియెను. "తల్లీ! నా కడుపునిండుగ, గొంతువరకు భోజనము పెట్టినావు. నాజీవ శక్తులు సంతుష్టి చెందినవి. ఎల్లప్పుడు ఇట్లేచేయుము. ఇది నీకు సద్గతి కలుగజేయును. ఈ మసీదులో గూర్చుండి నేనెన్నడును అసత్యము పలుకను. నాయందిట్లే దయచూపుము. మొదట ఆకలితో నున్న జీవికి భోజనము పెట్టిన పిమ్మట నీవు భుజింపుము. దీనిని జాగ్రత్తగా జ్ఞప్తియందు ఉంచుకొనుము" అని చెప్పిరి.

ఆమెకు బాబా మాటలు అర్థముకాక "బాబా! నేనే యితరుల యిండ్లలో భోజనము చేయుచుంటిని. నీకెట్లు భోజనము పెట్టగలను ?" అని ఆత్మారాముని భార్య బాబాతో అనెను. అప్పుడు బాబా "నీవు భుజించుటకు పూర్వము ఏ కుక్కకు రొట్టెముక్క పెట్టితివో, అదియు నేను ఒక్కటియే. అదే విధముగా పిల్లులు, పందులు, ఈగలు, ఆవులు మొదలుగా గల వన్నియు నా అంశములే. నేనే వాని ఆకారములో తిరుగుచున్నాను. ఎవరైతే సకల జీవులలో నన్ను చూడగలుగుదురో వారే నా ప్రియభక్తులు. కాబట్టి నేనొకటి తక్కిన జీవరాశి యింకొకటి యను ద్వంద్వభావమును అనగా భేదభావమును విడచి నన్ను సేవింపుము." అని ఆమెతో చెప్పగనే ఆత్మారాముని భార్య ఆనందముతో సాయినాథునకు ప్రణమిల్లెను.

శ్రీమతి కపర్దే షిరిడీలో ఉన్నప్పుడు వారింటికి భోజనమునకు వస్తానని బాబా మాట యిచ్చారు. ఆ మాట ప్రకారము ఒకరోజు ప్రక్క యింటివారి గేదె రూపములోను, రెండవ రోజున ఒక కుక్క రూపముననుు వచ్చి ఆమెచే దెబ్బలు తినెను. మూడవ రోజున చీమల రూపములో వచ్చి, ఆమె బాబా కొఱకు తయారుచేసి యుంచిన వంటకములను ఆరగించెను. కాని ఈ విషయములు ఆమె గ్రహించలేక మసీదుకు వచ్చి, తన యింటికి భోజనమునకు రాలేదేమియని బాబాను అడిగినది. అందుకు బాబా "నీచేత దెబ్బలు తిన్న గేదె, కుక్క మఱియు

వంటకముల నారగించిన చీమలును నేనే అని తెలిపి, అన్ని రూపములలో నున్నది నేనేయని, విశ్వములో నున్న సకల జీవులు తన రూపమే''నని ఆమెకు తెలియజెప్పెను.

శ్యామకర్ణ అనే గుఱ్ఱమునకు తర్ఫీదు యిచ్చు వ్యక్తి కొట్టినప్పుడు, ఆ శ్యామకర్ణను కొట్టిన దెబ్బలు తనపై చూపి, ఏ ప్రాణిని హింసించినను తనను హింసించినట్లేనని గుర్తింపుచేసి, తాను విశ్వరూపుడ నని బాబా ఋజువు చేసెను.

నాటికి - నేటికి ఏనాటికైనా సాయిభక్తులెల్లరును ఆచరించుటకు, బాబానిర్దిష్టమైన ఈ లీలల ద్వారా తన సర్వవ్యాపకత్వమును బోధించెను.

అట్టి దయామయుడు, ప్రేమమూర్తి, కరుణాసింధు ఐన బాబా, దేహధారిగ మానవుల మధ్య సంచరించి తన అవతార విశేషమును ప్రకటించి, విశ్వాసమును కలిగించి, పరమాత్మ సాకారుడు కాదని, అన్నిట - అంతటా నిండియున్న నిరాకార స్వరూపుడని తెలుపుటకు సిద్ధమయిరి. తన శిష్యునిగా కాని, ప్రతినిధిగా కాని, ఎవరిని ప్రకటించకయే తనను ఆశ్రయించుచున్న భక్తుల సంరక్షణకు అన్ని ఏర్పాట్లు తాను సిద్ధపఱచి, తాము దేహమును చాలించి, నిరాకారముగా తన సంరక్షణా కార్యమును కొనసాగించుచున్నారు. ఆ లీలలను వినిపించెదను సావధానముగా వినవలసినదిగా పౌరాణికుండు ఇట్లు చెప్పసాగెను.

నాగపూర్ నివాసి కోటీశ్వరుడగు శ్రీమాన్ బాపుసాహెబ్ బూటీకి బాబా కలలో కనుపించి, ఒక భవనమును మందిరముతో సహా నిర్మాణము చేయుమని చెప్పి, ఒక భవనమును నిర్మాణము చేయించుకొనెను. దేవాలయము పూర్తికాగానే నేనే అచట నివసించుటకు వచ్చెదను. వాడపూర్తి అయిన పిమ్మట మనమే దానిని ఉపయోగించుకొనవలెను. మనమందరము అచట ఉండుదము. అందరము కలసిమెలసి యాడుకొందము. ఒకరినొకరు కౌగలించుకొని సంతోషముగా నుండవచ్చునని బాబా వారికి చెప్పిరి.

1918 సెప్టెంబరు 28న బాబాకు కొంచెము జ్వరము తగిలినది. బాబా భోజనము మానుట వలన బలహీనముగుచుండిరి. మానవులు దేహత్యాగము చేయుటకు ముందు ఆధ్యాత్మిక చింతనతో గడుపవలెనని చెప్పుటకు వాఝె అను భక్తునిచే రామవిజయము ను చదివించిరి. 1918 అక్టోబరు 15వ తేది మంగళవారము మధ్యాహ్నము గం. 2-30 లకు దశమి వెళ్ళగ ఏకాదశి ఘడియలలో తనకు ఆ స్థలము అనగా మసీదు బాగుగా లేదనియు, బూటీవాడకు తీసికొని పోయినచో అచట బాగుగా యుండునని చివరిసారిగా పలుకుచు, బాబా బయాజీ శరీరముపై ఒఱిగి తుది శ్వాసను విడచిరి.

శ్రీ సమర్థ సద్గురు సాయినాధ్ మహారాజ్‌కీ జై
శ్రీ సమర్థ సద్గురు సాయినాధ్ మహారాజ్‌కీ జై
శ్రీ సమర్థ సద్గురు సాయినాధ్ మహారాజ్‌కీ జై

తరువాత నానాసాహెబ్‌నిమోన్కర్ నీళ్ళు తెచ్చి బాబా నోటిలో పోసెను. ఆ నీరులోనికి వెళ్ళక బయటకు వచ్చుటచే బిగ్గరగా ''ఓ దేవా'' అని నిమోన్కరు అరచెను. అంతే! బాబా భౌతిక శరీరమునుండి పంచ ప్రాణములు అనంత వాయువులలో లీనమైనవి.

బాబా తాను షిరిడీ వచ్చిన మొదటిరోజులలో తనకు నిత్యమురొట్టె-కూర తెచ్చి పెట్టిన బయాజిబాయి సేవకు గుర్తింపుగా ఆమె కుమారుడైన తాత్యా అనారోగ్యముతో నుండగా అతనిని మృత్యువు నుండి రక్షించుటకే బాబా తన దేహమును త్యాగము చేసిరని భక్తులు తలచిరి.

బాబా దేహత్యాగము చేసిన మరురోజు అనగా బుధవారము ఉదయము శ్యామాకు మేనమామ యగు లక్ష్మణ మామా జోషికి బాబా స్వప్నములో గాన్పించి, చేయిపట్టిలాగి "త్వరగా లెమ్ము, బాపు సాహెబ్ నేను మరణించితి ననుకొనుచున్నాడు. అందుచే అతడురాడు. నీవువచ్చి పూజ చేసికాకడహారతిని యిమ్ము" అని బాబా చెప్పెను. బాబా చెప్పినట్లే లక్ష్మణ మామాజోషి వచ్చి బాబా భౌతికదేహమునకు పూజచేసి హారతి యిచ్చెను. అనగా బాబా తాను దేహమును త్యజించుట, తన అవతార పరిసమాప్తి కాదని ఈ లీలద్వారా నిరూపించిరి.

ఒకప్పుడు దాము అన్నా అనే భక్తునితో నాకు మరణమే లేదు అని చెప్పియుండెను. బాబా దేహత్యాగము చేసిన రాత్రి గం. 12.00 లకు శ్రీమతి ప్రధాన్‌కు బాబా కలలో కనుపించి "మహాత్ములు చనిపోరు. సమాధి అవుతారు" అని చెప్పిరి.

బాబా నిర్జీవ దేహము 36 గంటలు ఉన్నను బిగిసికొని పోలేదు. వారు ధరించి యున్న కఫ్నిని ఆ దేహము నుండి చింపకయే సులభముగా తీయగలిగిరి. ఆ విధముగనే బాబా దాసగణుకు కలలో కనుపించి చెప్పిన ప్రకారము దాసగణు షిరిడీ వచ్చి బాబా భౌతిక దేహమును పూలతో కప్పెను.

బాబా పవిత్ర దేహమును భక్తులు దర్శించి నమస్కరించుకొనుటకు వీలుగా మసీదులో కూర్చుండబెట్టిరి. బుధవారము సాయంకాలము బాబా దేహమును షిరిడీ గ్రామములో ఉరేగించి, బూటీ నిర్మించిన మందిరములో, మురళీధరుని ప్రతిష్ఠించుటకు నిర్ణయించిన చోట సమాధిచేసిరి. ఇదియే షిరిడీలో భక్తులు దర్శించు సమాధి మందిరము.

సమాధియైన తరువాత కూడ బాబా భక్తులకు దర్శనమిచ్చి కాపాడు చున్నారు. " నా భక్తుని గృహములో అన్నవస్త్రములకు ఎప్పుడు లోటు ఉండదు. నా యందు మనస్సు నిలిపి భక్తి శ్రద్ధలతో మనఃపూర్వకముగా నన్నే ఆరాధించు వారి యోగక్షేమములు నేనే జూచెదను" అని చెప్పినట్లు బాబా యిప్పుడు అనుగ్రహించుచున్నారు.

"దానము చేయువాడిచ్చునది ప్రస్తుతము విత్తనము నాటుట వంటిది. అది ముందుముందు గొప్ప పంట అనుభవించుట కొఱకే. కనుక ధనము పొందవలెననినచో దానిని ప్రస్తుతము ఇతరుల కిచ్చుటే సరియైన మార్గము" అని చెప్పిరి.

"సమాధి చెందినప్పటికి నా సమాధి నుండి నా యెముకలు మాట్లాడును. నేనుగాక నా సమాధి కూడ మాట్లాడును. కదులును. మనస్ఫూర్తిగా శరణుజొచ్చిన వారితో మాట్లాడును." అని బాబా అభయమిచ్చిరి.

"నన్ను నమ్మినవారినెన్నడు పతనము కానీయను. నా వానిని నా నుండి దూరమేనాటికి కానీయను. చివర వఱకు ఉండి గమ్యము చేరుస్తాను" అనియు బాబా చెప్పి అనుగ్రహించుచున్నారు.

శ్రీ సాయిబాబా దేహత్యాగము తరువాతనే బహుళముగా తన లీలలు చూపుచు అనుగ్రహించుచున్నారు. శ్రీసాయిపదభక్తి అబ్బుట మన అదృష్టము. శ్రీసాయి స్మృతిమాత్ర ప్రసన్నుడు. స్మరణమాత్ర సంతుష్టుడు. కఠిన నియమములతో పనిలేక కటాక్షించు కరుణామయుడు. ఇట్టులే చెప్పవలెనన్న బాబా లీలలు అనంతములు. బాబా నామస్మరణ పాపహరణము.

సాయి సత్యవ్రతములను ఎప్పుడు చేయాలి ? ఎలా చేయాలి అని శ్రోతలు కోరగా పౌరాణికుండు ఇట్లు చెప్పిరి.

ఈ సాయి సత్యవ్రతములను ఏ కోరిక నెరవేరుటకైనను చేసుకొనవచ్చును. గృహములలో ఎవరికివారుగాగాని, సాయిమందిరములలో సామూహికముగాగాని చేసుకొనవచ్చును. వ్రతమాచరించునప్పుడు

శరీరము శుభ్రముగను, మనస్సును పవిత్రముగను ఉంచుకొనుట అవసరము. గురువారము, ఏకాదశి, పౌర్ణమి మరియు ఇతర పవిత్రదినములలోను, మనస్సునకు సంకల్పము కలిగిన ఏ రోజైనా పగలుకాని, రాత్రికాని ఈ వ్రతమాచరించవచ్చును. శక్తికొలది ప్రసాదము వినియోగము చేయవచ్చును. అన్నిటికన్నను ఈ వ్రతమాచరించుటకు భక్తి శ్రద్ధలు, ఓర్పు విశ్వాసములు ముఖ్యమని గమనించవలెను.

ఈ వ్రతము చేయలేనివారు శ్రద్ధగా వ్రతకథలను విని తీర్థప్రసాదములు స్వీకరించినను అట్టి ఫలితమునే పొందెదరు. వివాహము కానివారు, విద్యార్థులు మరి ఇంకెవరైనా ఈ వ్రతము ఆచరించుటకు అవకాశము లేనివారు గురువారము కాని, ఆదివారముకాని, ఎప్పుడైనా సాయి పటము ముందు కూర్చొని ఇందులోని ఐదు కథలు మాత్రము చదువుకొని, బాబాకు నమస్కరించుకొన్న, వ్రతము చేసుకున్నంత ఫలమును పొందగలరు. నియమముగా ఈసాయి సత్యవ్రతముల నాచరించి కలిప్రభావము నుండి రక్షణపొంది సుఖ - శాంతులు పొందుదుము గాక.

సత్యం - జ్ఞానం - అనంతం - బ్రహ్మ

ఇదియే సాయిస్వరూపం

ఓం శ్రీసాయిరాం

పంచమోధ్యాయః సమాప్తః

వ్రతకథలు పూర్తిఅయిన తరువాత ఈ క్రింది ఉపచారములు బాబాకు చేయవలెను. కలాపము పూజ చివరలో చేసినట్లు చేయవలెను.

పూజ : ఓం శ్రీ సాయినాథాయ నమః అని 11 సార్లు చెప్పుచు అక్షతలు, పూలు బాబాపై వేయుచు పూజచేయవలెను.

ధూపం: శ్రీ సాయినాథాయ నమః ధూపమాఘ్రాపయామి.

దీపం : శ్రీ సాయినాథాయ నమః దీపం దర్శయామి.

నైవేద్యం : కొబ్బరికాయ కొట్టవలెను. మహానైవేద్య పదార్థములపై (అన్నం , కూర, పప్పు మొదలగునవి) మూతలు తీసి వాటిపై నీటిని చల్లుచూ ఈ క్రింది మంత్రము చెప్పవలెను.

ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ (నీటిని చుట్టు త్రిప్పుచు)

సత్యంత్వర్తేన పరిషించామి (అనిచెప్పి) అమృతమస్తు, అమృతోపస్తరణమసి (అని రెండు ఉద్ధరణుల నీటిని పళ్ళెములో వదలవలెను).

శ్రీసాయినాథాయ నమః శాక, సూప, దధి, ఘృత, భక్ష్య, భోజ్య అమృత నైవేద్యము సమర్పయామి (చేతులతో పదార్థములు బాబాకు చూపుచు)

1. ఓం ప్రాణాయ స్వాహా 2. ఓం అపానాయ స్వాహా 3. ఓం వ్యానాయ స్వాహా 4. ఓం ఉదానాయ స్వాహా 5. ఓం సమానాయ స్వాహా (చెప్పి) మధ్యే మధ్యే పానీయం సమర్పయామి, ఉత్తరాపోశనం సమర్పయామి, హస్తప్రక్షాళనం సమర్పయామి, పాదప్రక్షాళనం సమర్పయామి, శుద్ధాచమనీయం సమర్పయామి, (అని చెప్పుచు ఉద్ధరిణెతో కలశము లోని నీటిని ఐదు సార్లు ముందున్న పళ్ళెములో వదలవలెను)

తాంబూలం : శ్రీ సాయినాథాయ నమః తాంబూలం సమర్పయామి.

కర్పూరహారతి : ఏకహారతిలో కర్పూరమును వెలిగించి బాబాకు చూపుచూ ఈ క్రింది పాట పాడాలి.

1. స్వామి సాయినాథాయ - షిరిడి క్షేత్రవాసాయ
మామకాభీష్టదాయ - మహితమంగళం ॥॥స్వామి॥

2. లోకనాథాయ - భక్తలోక సంరక్షకాయ ॥ ॥లోక॥
నాగలోక స్తుత్యాయ - నవ్యమంగళం ॥ ॥స్వామి॥

3. భక్తబృందవందితాయ - బ్రహ్మస్వరూపాయ । ॥భక్త॥
ముక్తిమార్గ బోధకాయ - పూజ్య మంగళం ॥ ॥స్వామి॥

4. సత్య తత్త్వబోధకాయ - సాధువేషాయ తే । ॥సత్య॥
నిత్య మంగళదాయకాయ - నిత్యమంగళం ॥ ॥స్వామి॥

శ్రీసాయినాథాయనమః కర్పూర నీరాజనం సమర్పయామి. ( ఆ జ్యోతిని బాబాకు చేతులతో చూపించవలెను). శుద్ధాచమనం సమర్పయామి (నీటిని పళ్ళెములో వదలవలెను. తరువాత అందరు ఆ జ్యోతిని కళ్ళకు అద్దుకొని నమస్కరించవలెను.)

మంత్రపుష్పం : పూలు, అక్షతలుచేతిలోనికి తీసికొనవలెను.

రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే నమోవయంవై శ్రవణాయ కూర్మహే ।
సమే కామాన్కామకామాయ మహ్యమ్ ।
కామేశ్వరో వైశ్రవణో దదాతు కుబేరాయ
వైశ్రవణాయ మహారాజాయ నమః ॥
ఓం తద్బ్రహ్మ, ఓం తద్వాయుః, ఓం తదాత్మా
ఓం తత్సత్యమ్, ఓం తత్సర్వమ్, ఓంతత్పురోర్నమః
అన్తశ్చరతి భూతేషు గుహాయాం విశ్వమూర్తిషు
త్వంయజ్ఞస్త్వం వషట్కారస్త్వమిన్ద్రస్త్వగ్ం
రుద్రస్త్వం విష్ణుస్త్వం బ్రహ్మత్వం ప్రజాపతిః
త్వం తదాప ఆపోజ్యోతి రసోమృతం
బ్రహ్మభూర్భు వస్సువరోమ్ ॥
ఆకాశాత్పతితం తోయం యథా
గచ్ఛతి సాగరమ్ సర్వదేవ నమస్కారః
సాయీశం ప్రతిగచ్ఛతి
జగదుద్ధారణార్థం యోనర రూపధరో విభుః
యోగినంచ మహాత్మానం సాయినాథం నమామి తం
దిగంబరాయ విద్మహే - అవధూతాయధీమహి
తన్నో సాయినాథ ప్రచోదయాత్
షిరిడివాసాయ విద్మహే - ద్వారకామాయి ధీమహి
తన్నో సాయినాథ ప్రచోదయాత్

శ్రీసమర్ధ సద్గురు సాయినాథాయ నమః పాదయోః

సువర్ణ దివ్యమంత్రపుష్పం సమర్పయామి.

(చేతిలోని అక్షతలు, పుష్పములు బాబా పాదముల వద్ద యుంచి నమస్కారముచేయవలెను).

ఆత్మ ప్రదక్షిణః : తనచుట్టు తానుకుడివైపుగా మూడుసార్లు తిరుగుచు ఈ క్రింది శ్లోకము చదువవలెను.

శ్లో॥ యానికానిచ పాపాని జన్మాంతర కృతానిచ ।
తానితాని ప్రణశ్యంతి ప్రదక్షిణం పదేపదే ॥

శ్లో॥ పాపోఽహం పాపకర్మాహం పాపాత్మా పాపసంభవః
త్రాహి మాం కృపయాదేవ శరణాగతవత్సల ॥

శ్లో॥ అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ ।
తస్మాత్కారుణ్య భావేన రక్ష సాయినాథ ప్రభో ॥

శ్రీసాయినాథాయ నమః ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి. సాష్టాంగ నమస్కారము చేయవలెను.

అక్షతలు తీసికొని బాబాపై వేయుచు (చామరము ఉన్న వీచవలెను). ఈ క్రిందివి చెప్పవలెను.

శ్రీ సాయినాథాయ నమః ఛత్రం సమర్పయామి
చామరం వీజయామి
నృత్యం దర్శయామి

గీతవాద్యాది సమస్త రాజోపచార, దేవోపచార పూజాం సమర్పయామి.

ప్రార్థన :

కరచరణ కృతంవా కాయజం కర్మజం వా,
శ్రవణనయనజం వా మానసం వా పరాధం ।
విదితమవిదితంవా సర్వమేతత్ క్షమస్వ ।
జయజయ కరుణాబ్ధే, శ్రీప్రభో సాయినాథ ॥

అనయా ధ్యానావాహనాది షోడశోపచార పూజయాచ, నైవేద్యాచ, భగవాన్ సర్వాత్మకః శ్రీసాయినాథ సుప్రీతో సుప్రసన్నో వరదో భవతు. ఉత్తరే శుభకర్మణ్యా విఘ్నమస్తు. సర్వాభీష్ట ఫలసిద్ధిరస్తు.

అక్షతలు నీరుచేతిలోకి తీసుకొని ఈక్రింది శ్లోకం చదివి నీరు పళ్ళెములో వదలి అక్షతలు బాబా పాదముల వద్దవేయవలెను.

కాయేనవాచ మనసేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనావా ప్రకృతే స్వభావాత్
కరోమి యద్యత్సకలం పరస్మై
సాయినాథాయేతి సమర్పయామి ॥

ఉద్వాసన :

యజ్ఞేన యజ్ఞమయజన్త దేవాస్తాని

ధర్మాణి, ప్రథమాన్యాసన్, తేహనాకం మహిమా

నస్సచన్తే యత్రపూర్వే సాధ్యాస్సన్తి దేవాః

శ్రీసాయినాథాయ నమః యథాస్థానం ప్రవేశయామి.

(బాబా పటము లేదా విగ్రహం ముందుకు జరుపవలెను).

తీర్థము పుచ్చుకొనుమంత్రము.

కుడిచేతిలోకి తీర్థము మూడుసార్లు వేసుకొనుచు పుచ్చుకొనుచు ఈ క్రింది శ్లోకము చదువవలెను.

శ్లో॥ అకాలమృత్యు హరణం, సర్వవ్యాధి నివారణం

సర్వపాప క్షయం దివ్యం సాయిపాదోదకం శుభమ్ ॥

గమనిక :

తీర్థప్రసాదములు తీసికొననిదే అచట నుండి లేచి వెళ్ళరాదు.

బాబా ఊది చేతిలోనికి తీసికొని ఈ క్రింది మంత్రము మూడుసార్లు చదివి నొసటన పెట్టుకొని, నోటిలో వేసుకొనవలెను.

పరమం పవిత్రం బాబా విభూతిం

పరమం విచిత్రం లీలా విభూతిం

పరమార్థ యిష్టార్థ మోక్షప్రదాతం

బాబా విభూతిం ఇదమాశ్రయామి

సాయిబాబా విభూతిం ఇదమాశ్రయామి ॥ (3 సార్లు)

శాంతి మంత్రము

అసతోమా సద్గమయ

తమసోమా జ్యోతిర్గమయ

మృత్యోర్మా అమృతంగమయ

సర్వేజనా సుఖినోభవంతు

ఓం శాంతి శాంతి శాంతిః

సాయిబాబా ప్రసాదమును తీసుకొనవలెను.

సాయి సత్యవ్రతం సంపూర్ణం.